



స్వయం ఉపాధికి చేయూత

బీసీ, ఎస్సీ, మైనారిటీ, ఈబీసీ, తదితర కార్పొరేషన్లకు జవసత్వాలు

- నిరుద్యోగ యువతకు రుణాలు
- భారీగా నిధులు మంజూరు
- ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో నిలిచిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- కోడ్ ముగిసిన అనంతరం చేపడతామంటున్న అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

గడిచిన ఐదేళ్లు నిధులు, విధులు లేక కునారిల్లిన ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కార్పొరేషన్లకు భారీగా నిధులు కేటాయించింది. ఆయా కార్పొరేషన్ల పరిధిలోని యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా గత నెల బీసీ, ఎస్సీ, మైనారిటీ, ఓబీసీ విభాగాలకు చెందిన నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు గత నెల 29 నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీనికి అనుగుణంగా జిల్లా అధికారులు ఏర్పాట్లుచేశారు. అయితే, అనూహ్యంగా జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ విడుదల కావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఐదేళ్లుగా స్వయం ఉపాధి రుణాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలపై నీళ్లుచల్లినట్టయింది.

వీటికి రుణాలు..

జిల్లాలో ఆయా కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి, జనరిక్ ఔషధ దుకాణాలు, బృంద వ్యాపారాలకు రుణాలు అందించాలని ప్రభుత్వం భావించింది. ఇందులో బ్యాంకు రుణంగా 50 శాతం, సబ్సిడీ 50 శాతం ఇవ్వనుంది. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1,615 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు కాగా, ఇందుకుగాను రూ.30.75 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 36 యూనిట్లకు రూ.62 లక్షలు, కమ్మ కార్పొరేషన్‌లో 14 యూనిట్లకు రూ.24 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 40 యూనిట్లకు రూ.69 లక్షలు, ఆర్య వైశ్య కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు రూ.29 లక్షలు, క్షత్రియ కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ.36 లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 50 యూనిట్లకు రూ.86 లక్షలు, బీసీ కార్పొరేషన్ (జనరిక్ మందుల షాపు)కు 33 యూనిట్లకుగాను రూ.26.4 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌లో జనరిక్ మందుల షాపులు ఆరు యూనిట్లకు రూ.48 లక్షలు, కమ్మ కార్పొరేషన్‌లో మూడు జనరిక్ మందుల షాపుల యూనిట్లకు రూ.24 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు ఏడు జనరిక్ మందులు షాపులకు రూ.56 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు మూడు జనరిక్ మందులు షాపుల ఏర్పాటుకు రూ.24 లక్షలు, క్షత్రియ కార్పొరేషన్‌కు నాలుగు జనరిక్ మందులు షాపులకు రూ.32 లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 12 జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు రూ.96 లక్షలను ... మిగతా 6వ పేజీలో



మాఘపౌర్ణమి సందర్భంగా ఆర్‌కే బీచ్‌లో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు

ఘనంగా మాఘపౌర్ణమి

సముద్ర స్నానాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున ఆర్కే బీచ్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు చేశారు. స్నానాలు చేసేందుకు వచ్చిన వారితో బీచ్‌రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది. రుషికొండ తీరంలోనూ భారీగా భక్తులు స్నానాలు చేశారు. ఇక భీమిలి వద్ద పవిత్ర గోస్తనీ సాగర సంగమ ప్రాంతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆది నుంచి నదీ సంగమ ప్రదేశంగా పేరొందిన భీమిలి సముద్ర తీరానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖల నుంచి భక్తులు రావడం పరిపాటి. ఉత్తర ముఖంగా సముద్రంలో కలుస్తున్న గోస్తనీ నది సంగమ ప్రదేశంలో స్నానాలు ఆచరించడం వల్ల పుణ్యం సిద్ధిస్తుందని, ఆరోగ్యదాయక జీవితం లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సముద్ర స్నానాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

వైసీపీ నేతల గుప్పెట్లోనే ఫిల్మ్ క్లబ్!

- ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టిన కార్యవర్గం
- కొనసాగేలా చక్రం తిప్పుతున్న కొందరు సభ్యులు
- కూటమి నేతల కరుణ కోసం నగరంలోని ఎమ్మెల్యేలందరికీ గౌరవ సభ్యత్వాలు
- పోలీస్ అధికారులకు కూడా...
- మరోవైపు నిర్వహణలో అనేక ఆరోపణలు

ఇటీవల చైర్మన్, కోశాధికారి రాజీనామా



భీమిలి బీచ్ రోడ్డులోని ఫిల్మ్‌నగర్ క్లబ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భీమిలి బీచ్ రోడ్డులోని ఫిల్మ్ నగర్ క్లబ్‌పై ఇంకా వైసీపీ నేతల ఆధిపత్యం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా అక్కడ పరిస్థితుల్లో వీసమెత్తు మార్పు రాలేదు. కార్యవర్గంలో చైర్మన్, కోశాధికారులు రాజీనామా చేసినా వాటిని ఆమోదించకుండా రాజకీయం చేస్తున్నారు. కొందరు క్లబ్‌ను గుప్పెట్లో పెట్టుకొని కోట్లాది రూపాయల డిపాజిట్లను కొల్లగొట్టాలని చూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్లబ్‌కు వెళ్లి కార్యవర్గాన్ని రాజీనామా చేయాలని ఆదేశించారు. ఆ తరువాత అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇటీవల క్లబ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, కోశాధికారి గోపీనాథ్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేశారు. క్లబ్‌కు వెళ్లడం మానేశారు. అయితే కార్యవర్గంలో కొందరు ఆ రాజీనామాలకు ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టారు. కూటమి నేతలను కలుస్తూ తామే కార్యవర్గంలో కొనసాగేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని ఎమ్మెల్యేలందరికీ క్లబ్‌లో గౌరవ సభ్యత్వాలు ఇచ్చారు. అంటే వారు ఎటువంటి సభ్యత్వ రుసుము కట్టాల్సిన అవసరం ... మిగతా 6వ పేజీలో

సూర్య ఘర్‌కు అరకొర స్పందన

పెట్టుబడి పెట్టేందుకు ముందుకురాని గృహస్థులు



- ఏడాది కాలంలో పేర్లు నమోదు చేసుకున్నవారు 66,960 మంది...
- ఏర్పాటైంది కేవలం 5,065 మాత్రమే
- అధికారులు అవగాహన కల్పిస్తున్నా కనిపించని ప్రయోజనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 'ప్రధానమంత్రి సూర్యఘర్' పథకం కింద రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. గృహస్థులు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపకపోవడం లేదు. దేశంలో కోటి ఇళ్లపై సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ పథకాన్ని గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు. 2025-26 వరకూ అమలులో ఉంటుంది. దీనిపై అవగాహన కోసం ఈపీడీసీఎల్ అధికారులు సోలార్ ప్యానళ్ల వెండర్లతో కలిసి సదస్సులు నిర్వహించారు. వ్యక్తిగత గృహాలు కలిగిన వారిలో అవగాహన పెంచడానికి అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్ వరకు యత్నిస్తున్నారు. అపార్టుమెంట్లకు వెళ్లి కార్యవర్గ సభ్యులకు వివరంగా చెబుతున్నారు. సోలార్ పవర్ వల్ల విద్యుత్ బిల్లు భారీగా తగ్గిపోతుందని, మొదట పెట్టుబడి పెట్టినా దానికి తగిన ఫలితాలు వస్తాయని పేర్కొంటున్నారు. నగరంలో గేటెడ్ కమ్యూనిటీలుగా గుర్తింపు పొందిన ఆక్సిజన్ టవర్స్, ఎంవీవీ సిటీ, స్కైలైన్ తదితర బహుళ అంతస్తుల సముదాయాలకు వెళ్లి రూఫ్ టాప్ సోలార్ ప్లాంటు ప్రయోజనాలు వివరించారు. అయినా పెద్దగా స్పందన లేదు.

ఏడాది కాలంలో 66,960 మంది మాత్రమే ఆసక్తి చూపుతూ పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 8,539 మంది దరఖాస్తు చేశారు. కేవలం 5,065 మంది మాత్రమే ప్లాంట్లు ... మిగతా 6వ పేజీలో

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

ప్రతి నియోజకవర్గానికి ఐదేళ్ల విజన్ యాక్షన్ ప్లాన్

- సమీకృత అభివృద్ధికి ప్రణాళికలు
- సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):



స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించుకోవలసి ఉంది. విజయవాడలో మంత్రులు, వివిధ శాఖల సెక్రటరీలతో మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన సమావేశంలో ఇదే అంశంపై దిశా నిర్దేశం చేశారు.

2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించడానికి 15 శాతం వృద్ధి రేటు దాటాల్సి ఉంది. జిల్లా భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి వనరుల ఆధారంగా ఐదేళ్లకు ప్రాజెక్టులు తయారు చేయాల్సి ఉంది. వాటిని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువచ్చి సమీకృత అభివృద్ధికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి. ప్రతి జిల్లాకు ఒక విజన్ ప్లాన్, అదేవిధంగా నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ విషయంలో జిల్లా అధికారులకు సెక్రటరీలు మార్గదర్శనం చేస్తారు. ప్రణాళికలు ఎలా అమలు చేస్తున్నారో తెలుసుకోవడానికి విజన్ మానటరింగ్ యూనిట్లు ... మిగతా 6వ పేజీలో

బర్డ్‌ఫ్లూతో అప్రమత్తం

ఫారాలు తనిఖీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు



భీమిలి మండలంలో కోళ్ల ఫారాలు తనిఖీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

- గోదావరి జిల్లాల నుంచి కోళ్లు తీసుకురాకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టు
- కోడిమాంసం, గుడ్లు బాగా ఉడికించిన తరువాతే తినాలని సూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

పొరుగునున్న గోదావరి జిల్లాలను బర్డ్‌ఫ్లూ వణికిస్తున్న నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు.



ఖాళీగా ఉన్న చికెన్ దుకాణం

గోదావరి జిల్లాల నుంచి నగరానికి బ్రాయిలర్ కోళ్లు, గుడ్లు సరఫరా అవుతుంటాయి. అలాగే విజయవాడ నుంచి తుని మధ్యనున్న చాలా ప్రాంతాల నుంచి గుడ్లు కోల్‌కతాకు ఎగుమతి చేస్తుంటారు. కోల్‌కతాకు గుడ్లు ఎగుమతి కావడంలో ఇబ్బంది లేకపోయినా విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు బ్రాయిలర్ కోళ్లు తీసుకురాకుండా చూస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఉత్పత్తి అయ్యే గుడ్లు, బ్రాయిలర్ కోళ్లను స్థానికంగా వినియోగించుకోవడంతో పాటు ఒడిశాకు ఎగుమతి చేస్తారు. అదే సమయంలో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు గోదావరి జిల్లాల నుంచి కోళ్లు, గుడ్లు వస్తుంటాయి. అయితే అక్కడ బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తిచెందడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు రోజుల నుంచి జిల్లాలో పౌల్ట్రీ ఫారాలను సందర్శించి యజమానులు, అక్కడ పనిచేసే సిబ్బందికి అవగాహన ... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

- 123 పోలింగ్ కేంద్రాలు
- నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరిరోజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి మొత్తం 22,493 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో పురుషులు 13,508, మహిళలు 8,985 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 5,529 మంది ఓటర్లు ఉండగా ... మిగతా 6వ పేజీలో

జిల్లాల వారీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం జిల్లా	31	3,416	1,619	5,035
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333
విజయనగరం జిల్లా	29	3,270	1,953	5,223
అల్లూరిసీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,999	5,529
అనకాపల్లి జిల్లా	24	1,789	1,096	2,885
మొత్తం	123	13,508	8,985	22,493

పూర్ణామార్కెట్‌లో బినామీ దందాపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జోన్-4 రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో ప్రారంభం

- శానిటేషన్ ఉద్యోగి పాత్ర ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ
- నేడో రేపు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్‌కు నివేదిక
- మార్కెట్‌లో గ్యాంగ్‌వేజ్ దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

పూర్ణామార్కెట్‌లో బినామీ దందాపై జీవీఎంసీ అధికారులు విచారణ ప్రారంభించారు. పదుల సంఖ్యలో దుకాణాలను కొంతమంది చేజిక్కించుకుని అద్దెకు ఇచ్చుకుంటుండడంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'పూర్ణామార్కెట్‌లో బినామీల దందా' శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సమగ్ర విచారణ నిర్వహించాల్సిందిగా రెవెన్యూ అధికారి అప్పలరాజును ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం మరో ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పూర్ణామార్కెట్‌కు వెళ్లారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలోని వివరాల ఆధారంగా ... మిగతా 6వ పేజీలో



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

‘గీతం’ దూరవిద్య కోర్సులలో అడ్మిషన్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ఆధ్వర్యంలో దూర విద్యావిధానంలో ఎంఏ ఇంగ్లీష్, బీఏ, బీకామ్ గ్రాడ్యుయేట్ కోర్సులు-2025 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తులను మార్చి 31లోగా పంపాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం వెబ్‌సైట్ : cdl.gitam.edu చూడవచ్చన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ నిర్వహణ పనులు జరుగుతున్నందుకు ఈ నెల 14న (శుక్రవారం) పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : బోడమిట్టపాలెం, చిప్పాడ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేస్తుండడంతో బోడమిట్టపాలెం పరిధిలో బోడమిట్టపాలెం, ముద్దాడపేట, రాముునాయుడు పేట, అల్లుపేట, రెల్లిపేట ప్రాంతాలతో పాటు చిప్పాడ ఫీడర్ పరిధిలో సిటీనగర్, చిప్పాడ, రెల్లిపేట, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండద ని పేర్కొన్నారు. అలాగే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ జేవీ అగ్రహారం, కొత్తవలస,నిడిగట్టు, మామిడిపాలెం, కృష్ణా కాలనీ, బిల్లలమెట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

వెంకన్న మూల విరాట్‌కు అర్చనలు



భీమునిపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భీమిలి వేంకటగిరిపై వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, ఫల, పుష్ప చందన, పసుపు తదితర దివ్య ఔషధాలతో అభిషేకం, ఆలయ అర్చకుల పర్యవేక్షణ, ఆలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, ఆర్.పెదబాబు, కె.ముత్యాలరావు, శంకర్, సన్నిబాబు, హరి, బాలాజీ పాల్గొన్నారు

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

సింహాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని ద్వారకానగర్‌కుచెందిన కేతవరపు గురుమూర్తి రూ.లక్ష విరాళం సమర్పించారు. విరాళాన్ని బుధవారం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్ రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ఒత్తిడి లేకుండా చదవండి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈవో ప్రేమకుమార్, చిత్రంలో హెచ్‌ఎం శైలజ

ఎండాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ఎన్.ప్రేమకుమార్ సూచించారు.జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఉన్న ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. పాఠశాల హెచ్‌ఎం వి.శైలజ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల సేవ

తగరపువలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తగరపువలస 1వ వార్డు పరిధిలో సాయి సంహిత ట్రస్టు అయిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధ్యాయ దంపతులు ఆర్. అప్పలరాజు, ఎం.సంతోషికుమారి తమ జీతంలో కొంత దాచుకుని ప్రతినెలా సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. కరోనా సమయంలో వృద్ధులకు రెండు లక్షల రూపాయల విలువైన సహాయం చేశారు. బంగ్లామెట్ట, 1వ వార్డు పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కొబ్బరి రొట్టెలు, డైరీ మిల్కు, చాక్‌లెట్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కెచ్‌పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. తమ పిల్లల పేరిట ఈ సంస్థను నడిపిస్తున్నామని వారు తెలిపారు.

భీమిలి తీరంలో మాఘ పౌర్ణమి సందడి

» గోస్తనీ సాగర సంగమంలో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
» సూర్య నమస్కారాలు, సాలగ్రామ పూజలు



భీమిలి తీరంలో భక్తుల కోలాహలం

భీమునిపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమి నేపథ్యంలో భీమిలిలోని పవిత్ర గోస్తనీ సాగర సంగమంలో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారు జాము నుంచి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయానికి భీమిలి తీరం భక్తజనసందోహంతో నిండిపోయింది. ఆది నుంచి నదీ సంగమ ప్రదేశంగా పేరొందిన భీమిలి సముద్రతీరానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి భక్తులు రావడం పరిపాటి. ఉత్తర ముఖంగా సముద్రంలో కలుస్తున్న గోస్తనీ నది సంగమంలో స్నానాలు ఆచరించడం వల్ల పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ఆరోగ్యదాయక జీవితం లభిస్తుందన్నది నమ్మకం.



సముద్ర తీరంలో సాలగ్రామ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వందలాది మంది భక్తులు తరలివచ్చి సాగర సంగమములో పుణ్యస్నానాలు ఆచరించారు. పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తులు తీరంలో సూర్యనమస్కారాలు చేసి, సాలిగ్రామ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీగా ఎక్కువగా ఉంది. సాయంత్రం వరకు కొందరు భక్తులు స్నానమాచరించారు.

సముద్ర స్నానాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ భీమిలి జోనల్ కమిషనరు ప్రసన్నవాణి ఆధ్వర్యంలో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. భీమిలి సీఐ సుధాకర్ పర్యవేక్షణలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. వాహనాలను సాగర సంగమం వరకూ వెళ్లకుండా మునిసిపాలిటీ శతాబ్ది న్న ఉత్సవ పైలాన్ వద్దే వాహనాలను నిలిపివేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : కలెక్టర్



గంధవరంలో సర్వే రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పద్మనాభం రూరల్/ పద్మనాభం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ సర్వే కార్యక్రమాన్ని సర్వే సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ కోరారు. బుధవారం ఉదయం గంధవరం గ్రామంలో నిర్వహిస్తున్న రెండో విడత భూ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో జరిగిన భూ సర్వేలో అనేక లోటు పాట్లు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ప్రస్తుత సర్వే రైతులకు మేలు చేసేలా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం.. అనంతవరంలో ఈ క్రాప్ నమోదును పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వరి, మొక్క జొన్న, ఇతర పంటలను రైతులు విధిగా ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతులకు ప్రత్యేక గుర్తింపు కోసం ప్రభుత్వం అగ్రి స్టాక్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సొంత భూమి గల రైతులందరికీ ప్రత్యేక ఐడీ నెంబర్‌ను జనరేట్ చేస్తారని, ఇందుకోసం రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకంతో సమీపంలో గల రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆ కార్డును పొందాలని కోరారు.పీఎం కిసాన్ రైతు భరోసా, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, యంత్ర పరికరాలు, పంటల రుణాలు పొందాలంటే ఐడీ నెంబరు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అప్పలస్వామి, తహసీల్దార్ కాకర ఆనందరావు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్. మండల వ్యవసాయాధికారి ఎంవీ చలం, మండల సర్వేయర్ రామకృష్ణ, సర్వే డీటీ వరలక్ష్మి, భీమిలి ఏఎంసీ మాజీ చైర్మన్ గొరైపాటి పెద ఎర్నినాయుడు, అనంతవరం సర్పంచ్ గొరైపాటి వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు సిద్ధనాతి వెంటరావు. అయా పంచాయతీల కార్యదర్శులు అప్పలరాజు, పైడయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

... 5వ పేజీ తరువాయి

అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

వెంకన్న సన్నిధిలో ఘనంగా అవబృదోత్సవం



అవబృదోత్సవంలో పూజలు



త్రిపురాంతకుని కల్యాణోత్సవంలో ఓ ఘట్టం



అప్పన్నకు భక్తుల సమక్షంలో గరుడ సేవ

సింహాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సింహాచల దేవస్థానం ఉపాలయం కొండదిగువ పూదోటలోని పద్మావతి అలిమేల్‌మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అవబృదోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. వార్షిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం పూర్వాచారం ప్రకారం ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ అర్చకులు తొలుత షోడశోపచారాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర జలాలు, పంచామృతాలు, పలురకాల పండ్ల రసాలతో అవబృదోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకిలో ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ఉంచారు. పండితుల వేద పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సింహాచల మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. భక్తులు నీరాజనాలిచ్చి వెంకన్నస్వామిని సాదరంగా ఆహ్వానించారు.

ముగిసిన త్రిపురాంతకుని కల్యాణోత్సవాలు

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి క్షేత్రపాలకునికి సంప్రదాయబద్ధంగా నిర్వహించిన స్నపన తిరుమంజనంతో ఐదురోజులు జరిగిన బాలసుందరి సహిత త్రిపురాంతకస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బుధవారం వేకువజామున స్వామికి యధావిధిగా నమకం, చమకంతో ఏకవార రుద్రాభిషేకం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలతో సింహగిరి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తరువాత స్వామిని పవిత్ర గంగధారకు తీసుకువెళ్లి సనాతన ఆచారం ప్రకారం పవిత్ర గంగధారతో స్నపన తిరుమంజనాన్ని జరిపి మంగళ నీరాజనాలిచ్చారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సీతాదేవి నడవడిక ఆదర్శనీయం: చాగంటి

కొమ్మాది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తాను ఎంతకష్టంలో ఉన్నా నిర్వహించవలసిన ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటించిన గొప్ప నడవడిక కలిగిన గృహిణి సీత అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా బుధవారం అరణ్యకాండలోని సీతాపహరణ ఘట్టాన్ని వివరించారు. యతి వేషధారణలో వచ్చిన రావణాసురుణ్ణి చూసి పూజనీయుడు అన్నభావనతో సీతమ్మ అతనికి అర్ఘ్య పాద్యాదులు సమర్పించి, తినటానికి కావలసిన వస్తువులు అందించడం ద్వారా ఆమె నడవడిక తెలియజేసిందన్నారు. యతి వేషంలో ఉన్న రావణాసురుడు క్రూరస్వభావం చేత సీతమ్మకు తాను ఎవరోచెప్పి శ్రీరాముడిని చేతకానివాడిగా నిందించి, తనకు భార్యగా ఉండమని అడగగా, పతివ్రత అయిన సీతమ్మ అతనికి మంచిని ప్రబోధించి శ్రీరాముని వైభవాన్ని తెలిపిందన్నారు. అనంతరం సీతాపహరణ, జటాయువు పోరాటం వంటి ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ రోడ్డుకు అభ్యంతరాలు



ప్రణవ్‌గోపాల్‌కు వినతి సమర్పిస్తున్న నరసింహం

సింహాచలం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ 98వ వార్డు పరిధిలో తాజాగా ప్రతిపాదించిన రోడ్డుపై కార్పొరేటర్ పి.వి. నరసింహం అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బుధవారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాజెక్టు అమలుకు ముందే భూమిని కోల్పోనున్నవారికి న్యాయపరంగా నష్టపరిహారాన్ని అందజేయాలి. నిబంధనల ప్రకారం పునరావాసం కోసం టీడీఆర్‌లను మంజూరు చేయాలి. ఇప్పటికే పాతగోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు చేపట్టిన బీఆర్‌టీఎస్ నిర్వాసితులకు అఫిడవిట్ ఆధారంగా మంజూరు చేసినట్లు ఇక్కడి బాధితులకు కూడా టీడీఆర్‌లు జారీ చేయాలి. అడివివరం రైతులు, ప్లాట్ యజమానులను సమావేశపరచి అభిప్రాయాలను తెలుసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

మరిన్ని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్టీపీఐ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ బాతా

తగరపువలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య అందరికీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో అవసరమైన మేరకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఇన్ ఇండియా (ఎస్టీపీఐ) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ బాతా పేర్కొన్నారు. బుధవారం సంగివలసలోని నీరుకొండ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ‘సాఫ్ట్‌వేర్ పార్కుల ఏర్పాటు ఆవశ్యకత’ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో ఐటీ పార్కులు 24 మాత్రమే ఉన్నాయని, వీటి సంఖ్య మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సాఫ్ట్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలు, విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. ఇందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కన్వీనరు డా.మురుగు పాండ్యన్, సీఎస్‌ఈ విభాగాధిపతి జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో బినామీ దందాపై విచారణ

... 5వ పేజీ తరువాయి

దుకాణాల వద్దకు వెళ్లి అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయో ఆరా తీశారు. అనంతరం సంబంధితులతో మాట్లాడి...ఆ దుకాణాలు ఎలా వారికి వచ్చాయి, అందుకు ఎవరు సహకరించారనే వివరాలు రాబట్టారు. బినామీ దందాకు మార్కెట్ ఉన్న ప్రాంతంలో శానిటేషన్ ఉద్యోగి సహకారం అందించినట్టు ప్రాథమికంగా గుర్తించారని తెలిసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక తయారుచేసి జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ద్వారా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు అందజేయనున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశాలను బట్టి శానిటేషన్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ.నరేష్‌కుమార్‌కు సిఫారసు చేస్తామని జీవీఎంసీ అధికారి ఒకరు వివరించారు. అలాగే బినామీ పేర్లతో ఉన్న దుకాణాలను స్వాధీనం చేసుకుని బయట వ్యాపారం చేసుకుంటున్న వారిలో అర్హులైన వారికి ప్రాధాన్యతా క్రమంలో కేటాయిస్తామని జోన్-4 కమిషనర్ తెలిపారు. పూర్ణామార్కెట్‌లో వ్యాపారం చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సరే జోన్-4 కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి పూర్ణామార్కెట్ లోపల గ్యాంగ్ వేజ్‌లోని దుకాణాలను ఉచితంగానే కేటాయిస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. గ్యాంగ్ వేజ్ దుకాణాలు పెట్టుకునేవారు రోజుకు రూ.35 మాత్రమే ఆశీల్ జీవీఎంసీకి చెల్లించాల్సిఉంటుందన్నారు. అంతకుమించి ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు.

బర్డ్ ఫ్లూతో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తున్నారు. జిల్లాలో 20 వరకూ ఫారాలలో 3.44 లక్షల కోళ్లు ఉన్నాయని విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డి.రామకృష్ణ అన్నారు. ఇప్పటివరకూ విశాఖ జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని పేర్కొన్నారు. అయినా ఫారాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చికెన్, గుడ్లు తినేవారంతా వాటిని బాగా ఉడికించాలని సూచించారు. తాజాగా వైరస్ ప్రభావంతో ఉత్తరాంధ్రలో గుడ్లు, చికెన్ వినియోగం స్వల్పంగా తగ్గిందని చిల్లర వర్తకులు చెబుతున్నారు.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కూడా ఏర్పాటవుతాయి.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలు భారీగా ఉంటున్నాయని, వాటి పరిష్కారం మాత్రం ఆ స్థాయిలో ఉండడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో అధికారులు వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ముఖ్యంగా రెవెన్యూ, భూ తగదాలు, ఇళ్ల సమస్యలు, నేరాలపై పోలీసులకు అందే ఫిర్యాదులే అధికంగా ఉంటున్నాయని లెక్కలు చెబుతున్నాయి.

విశాఖ జిల్లా నుంచి 37,134 ఫిర్యాదులు అందగా, వాటిలో భూ తగాదాలకు చెందినవే ఎక్కువగా ఉండడం గమనార్హం. హౌస్ హోల్డ్ అర్జీల సంఖ్య 19,422గా ఉంది. ప్రత్యేకంగా సీఎంఓకు అందిన విశాఖ జిల్లా సమస్యలు 655. ప్రజలు సంతృప్తి చెందేలా ఫిర్యాదులు పరిష్కారం కావాలని సూచించిన నేపథ్యంలో అధికారులు వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

స్వయం ఉపాధికి చేయూత

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం కేటాయించింది. అలాగే, కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రన్న స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు జిల్లాకు 452 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.96 లక్షలు కేటాయించింది. ఆయా యూనిట్లకు సంబంధించి కేటాయించిన మొత్తంలో 50 శాతం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం లభిస్తుంది. మొత్తంగా ఆయా కార్పొరేషన్లకు సంబంధించి 2,313 యూనిట్లు మంజూరు కాగా, ఇందులో బ్యాంకు రుణంగా రూ.27.21 కోట్లు, సబ్సిడీ రూ.27.21 కోట్లు కలిపి మొత్తంగా రూ.54.44 కోట్ల విలువైన యూనిట్లను మంజూరు చేసింది.

కోడ్ ముగిసిన తరువాతే...

- కె.శ్రీదేవి, ఇన్‌చార్జి బీసీ కార్పొరేషన్ ఈడీ

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ ఆదేశాలతో వాయిదా వేశాం. కోడ్ ముగిసిన వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తాం. ఆయా కార్పొరేషన్లకు చెందినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిధులు వెనక్కి వెళతాయన్న భయం లేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానటరింగ్ సిస్టమ్ (ఓబీఎంఎంఎస్) ఓపెన్ అవుతుంది. అప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు.

‘సూర్య ఘర్’కు అరకొర స్పందన

... 5వ పేజీ తరువాయి

పెట్టుకున్నారు. వాటి సామర్థ్యం 17,573 కిలోవాట్లు. ఆసక్తి చూపించిన వారిలో పది శాతం మంది కూడా వీటిని ఏర్పాటు చేసుకోకపోవడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

ఇదీ పథకం

నెలకు 120 యూనిట్లు ఉపయోగించేవారికి ఒక కిలోవాట్ సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తారు. ఈ యూనిట్‌కు రూ.60 వేలు ఖర్చవుతుంది. అందులో రూ.30 వేలు రాయితీగా వస్తుంది. నెలకు 240 యూనిట్లు వినియోగించేవారు రెండు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. వీరికి రూ.1.2 లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.60 వేలు రాయితీగా లభిస్తుంది. కాగా నెలకు 360 యూనిట్లు ఉపయోగిస్తే మూడు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. దీనికి రూ.1.8 లక్షలు పెట్టుబడి అవసరం. రాయితీ రూ.78 వేలు వస్తుంది.

నెలనెలా బిల్లు కట్టేస్తున్నాము కదా...ఇబ్బందులు లేవు. ఇప్పుడు సోలార్ పవర్ అని రూ.లక్షలు పెట్టుబడి దేనికి?, దీనివల్ల మిగిలేది ఏముంది?...ఒకవేళ సోలార్ ప్యానళ్లు ఏ తుఫాన్ గాలికో పాడైపోతే పరిస్థితి ఏమిటి?...అనే ఆలోచనలో కొంతమంది ముందుకురావడం లేదు. అధికారులు మాత్రం వచ్చే ఏడాది మార్చి వరకూ మాత్రమే ఈ పథకం అమలులో ఉంటుందని, ఆ లోగా ఉపయోగించుకుంటే 50 శాతం రాయితీ వస్తుందని చెబుతున్నారు. పేర్లు రిజిస్టర్ చేసుకున్నవారు దరఖాస్తు సమర్పిస్తే, ఆ తరువాత ప్రాసెస్ అంతా తాము చూసుకుంటామని హామీ ఇస్తున్నారు.

వైసీపీ నేతల గుప్పెట్లోనే ఫిల్మ్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

లేదు. ఎమ్మెల్యేలపై నిజంగా గౌరవం ఉంటే ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అవకాశం ఇవ్వాలి. కానీ ఇప్పుడు ఇవ్వడమే అనుమానాలకు తావిస్తోంది. అక్కడితో ఆగకుండా జిల్లాలో పలువురు అధికారులకు కూడా ఉచిత సభ్యత్వాలు ఇచ్చారు. నగరంలోని ప్రముఖ క్లబ్‌లలో గ్రూప్-1 స్థాయి అధికారులకు ఉచిత సభ్యత్వాలు ఇచ్చే ఆనవాయితీ ఉంది. రెవెన్యూలో అయితే ఆర్‌డీఓ స్థాయి, ఆపై అధికారులకు, పోలీసులకైతే డీఎస్పీ ఆ స్థాయి అధికారులకు ఇవ్వాలి. కానీ ఈ క్లబ్ మాత్రం సీఐ స్థాయి అధికారులకు కూడా ఉచితంగా సభ్యత్వాలు ఇస్తోంది. ఈ గౌరవ, ఉచిత సభ్యత్వాలన్నీ (సుమారు 50) జనరల్ బాడీ మీటింగ్‌లో చర్చించకుండానే ఇచ్చారని పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో జరిగే గొడవలపై ఎటువంటి కేసులు లేకుండా ఉండేందుకే అధికారులు అందరికీ ఉచిత సభ్యత్వాలు ఇచ్చారని విమర్శలు ఉన్నాయి.

పవన్‌కుమార్ చెప్పిందే వేదం

నగరంలో ఓ రెస్టారెంట్‌లో పనిచేసే పవన్ కుమార్ అనే యువకుడిని కార్యవర్గంలోని ఒక వ్యక్తి తీసుకువచ్చి క్లబ్‌లో ఆపరేషన్ మేనేజర్‌గా నియమించారు. అప్పటి నుంచి సభ్యులు ఎవరైనా ఏదైనా ఈవెంట్ పెట్టుకుంటే...వాటికి అవసరమైనవన్నీ క్లబ్ నుంచే తీసుకోవాలని చెబుతున్నారు. బయట నుంచి ఫుడ్, ఫొటోగ్రాఫర్, డెకరేషన్, సింగర్స్‌ని తెచ్చుకుంటే వారికి ఇచ్చే మొత్తంలో 20 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల డిసెంబరు 31న నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ఈవెంట్ నిర్వాహకులు కూడా రూమ్ అద్దె, ఫుడ్ బిల్లు కట్టాలని డిమాండ్ చేశారు. తాము ఈవెంట్ నిర్వహించడానికి వచ్చిన అతిథులమని, తమకు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత క్లబ్‌దని సదరు నిర్వాహకులు చెప్పగా, కార్యవర్గంతో మాట్లాడుకోవాలని, తనకు మాత్రం బిల్లు కట్టాలని పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. అక్కడ ఆయన మాటే వేదం. దీని వెనుక ఎవరు ఉన్నారనేది క్లబ్బులో అందరికీ తెలిసిందే.

నెల రోజులు గెస్ట్‌రూమ్‌లో...

పవన్‌కుమార్ ఇటీవల బయట ఎక్కడో ప్రమాదం జరిగి గాయపడ్డారు. క్లబ్‌లో సిబ్బందికి క్వార్టర్లు ఉన్నాయి. ఆయన్ను అక్కడ ఉంచి చికిత్స చేయించవచ్చు. కానీ అలా చేయకుండా క్లబ్‌లో ఐదు గెస్ట్ రూమ్‌లు ఉండగా అందులో ఒకటి ఆయనకు ఇచ్చారు. నెల రోజులు అందులో ఉంచారు. క్లబ్ నుంచే నెల రోజులూ ఆహారం పెట్టారు. ఆ రూమ్‌కి రోజుకు అద్దె సభ్యులకైతే రూ.2 వేలు. ఇతరులకైతే రూ.2,500. ఈ విషయం తెలిసి ఓ సభ్యుడు కార్యవర్గానికి లేఖ రాశారు. పవన్‌కుమార్ గెస్ట్ రూమ్ వాడడం వల్ల క్లబ్‌పై రూ.2.2 లక్షల భారం పడిందని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సిబ్బందిలో ఎవరు గాయపడినా ఇలాగే గెస్ట్‌రూమ్‌లో పెట్టి, చికిత్స చేస్తారా? ఫుడ్ పెడతారా? అని ప్రశ్నిస్తే...ఇప్పటివరకూ సమాధానం ఇవ్వలేదు. ఈ పవన్‌కుమారే క్లబ్‌కు అవసరమైన మెటీరియల్ అంతా కొంటారు. కిచెన్ ఇన్‌చార్జి ఆయనే. ఈవెంట్లకు ధరలు నిర్ణయించేదీ ఆయనే. ఒక వ్యక్తికి ఇన్ని బాధ్యతలు అప్పగించడమేమిటని పలువురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

మరికొన్ని ఆరోపణలు

- క్లబ్‌లో 50 సీసీ టీవీ కెమెరాలు పెట్టారు. వాటి ఫుటేజీ మొబైల్ యాక్సెస్‌ని కార్యవర్గంలో ఒక వ్యక్తి తీసుకున్నారు. సాధారణంగా ఇలాంటివి చైర్మన్, సెక్రటరీ స్థాయి వారికి యాక్సెస్ ఇస్తారు. ఆ వ్యక్తికి ఎవరు ఇచ్చారనే దానికి సమాధానం లేదు.
- క్లబ్‌కు రూ.40 కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నాయి. వీటిని ఇటీవల తరచూ బ్యాంకులు మారుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి కొందరు కీలక వ్యక్తులు ఈ డిపాజిట్లను ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

క్యాంపు నుంచి వచ్చాక మాట్లాడతా

- కాయల వెంకట రెడ్డి, చైర్మన్.

క్లబ్‌లో పదవికి రాజీనామా చేసిన అంశం నిజమా? కాదా? అని కాయల వెంకటరెడ్డికి ఫోన్ చేసి అడగగా అది ఇంకా ఆమోదం పొందలేదని సమాధానం ఇచ్చారు. ఇంకా అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పగా, తాను క్యాంపులో ఉన్నానని, వచ్చాక మాట్లాడతానని చెప్పారు.

రోడ్లపైనే నిర్మాణ సామగ్రి

- రోజుల తరబడి తొలగించకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు
- యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నా నోరు మెదపని అధికారులు



హెచ్‌బీ కాలనీలో రోడ్డును ఆక్రమించి వేసిన ఇసుక

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో కేవలం స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలాలు మాత్రమే కాకుండా రోడ్డు సైతం ఆక్రమణలను గురవుతున్నాయి. ఎవరైనా ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఒక్కరోజు రోడ్డు



రోడ్డు పక్కనే అమ్మకానికి వేసిన పిక్క, ఇసుక

పక్కన ఇంటి నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచితే వెంటనే విరుచుకు పడే టౌన్ ప్లానింగ్ సిబ్బంది.. రోజుల తరబడి రోడ్డుపైనే నిర్మాణ సామగ్రిని ఉంచి భారీ భవనాలను నిర్మిస్తున్నా వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌బీ కాలనీలోని శివాలయం సమీపంలో గల రోడ్డుపై నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, కంకర, ఇటుకలను వేశారు. రోజులు గడుస్తున్నా తీయడం లేదు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా ఉందంటూ స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. దీనివల్ల ఈ మార్గంలో స్కూళ్లు, అఫీసులకు వెళ్లే వాహన చోదకులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కంకర ఉండడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి సమయాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అంటున్నారు.

కేవలం ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే వారితోనే కాకుండా స్థానికంగా కొందరు రోడ్లపైనే ఇటుక, పిక్క, ఇసుక వంటివి వేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా సామగ్రిని రోడ్డు పక్కనే పోగు పెట్టి విక్రయాలు చేపడుతున్నారు. ఇలాంటి వారి వల్ల కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

ఇలా రోడ్ల పక్కనే నిర్మాణ సామగ్రి అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణ సామగ్రిని బహిరంగంగా విక్రయిస్తుంటే కారకులపై చర్యలు తీసుకొని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నట్టు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమ్మై చొరవ చూపి ఈ రోడ్ల ఆక్రమణను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షలకు 355 మంది విద్యార్థులు

- వెనుకబడిన విద్యార్థుల కోసం 42 మంది టీచర్లతో ప్రత్యేక బృందం
- తోటగరువు హెచ్‌ఎం దుర్గాభవానీ



ఆరిలోవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 2024-25 సంవత్సరానికి పదో తరగతి పరీక్షలకు 355 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు హెచ్‌ఎం దుర్గాభవానీ తెలిపారు. వీరిలో బాలికలు 165 మంది, బాలురు 190 మంది హాజరు కానున్నట్టు వెల్లడించారు. చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. వీరిని ఏ, బీ కేటగిరీలుగా విభజించి ప్రత్యేక బోధన చేస్తున్నట్టు చెప్పారు. మొత్తం 42 మంది ఉపాధ్యాయులకు ఈ బాధ్యతలు అప్పగించనట్టు చెప్పారు. ఒక ఉపాధ్యాయుడికి ముగ్గురు, నలుగురు విద్యార్థుల చొప్పున బోధన సాగిస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన సాగిస్తున్నామన్నారు. గత ఏడాది 67 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

అలాగే జిల్లా కామన్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం ప్రీ-ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలు సోమవారంతో ముగుస్తాయని తెలిపారు. ఈ పరీక్షలో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు మరింత ప్రత్యేక తర్ఫీదు అందించి పరీక్షలకు సిద్ధం చేయనున్నట్టు హెచ్‌ఎం దుర్గాభవానీ తెలిపారు.

జీరో డిఫెక్ట్.. జీరో ఎఫెక్ట్‌పై అవగాహన సదస్సు

సిరిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ - లీన్ సర్టిఫికేషన్'పై ఎలిగెంట్ హోటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ విశాఖపట్నం జోన్ వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి మాట్లాడుతూ ఉత్పత్తి విలువ, మార్కెట్ రీచ్‌ను మెరుగుపరచడంలో నాణ్యత, ధ్రువీకరణల ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌బీక్యూపీ సలహాదారు సి.వేణుగోపాల్ మాట్లాడుతూ భారతదేశంలో అక్రిడిటేషన్, ధృవీకరణ ప్రక్రియలలో క్యూసీఐ బోర్డులు, విభాగాల పాత్ర గురించి వివరించారు. క్యూసీఐ ఎంపానెల్డ్ నిపుణుడు వెంకట సత్యవినోద్ జెడ్ సర్టిఫికేషన్, లీన్ పథకాలపై వివరించారు. జెడ్ స్కీమ్‌లోని కీలక అంశాలపై ప్రస్తావించారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

దారిదోపిడీ దొంగల అరెస్టు : చోరీ సొత్తు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

భీమునిపట్నం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దాకమర్రి రోడ్డులో దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురిని భీమిలి పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనం, ఆటోను సీజ్ చేసారు. ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశ్ తెలిపిన వివరాల మేరకు.. దివీస్ కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కాళ్ల లీలా వరప్రసాద్ ఈనెల 10న స్నేహితులు శీర రామకృష్ణ, కుంచాడ రాంబాబులతో కలిసి విజయనగరం వైపు వెళ్తుండగా దాకమర్రి వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డగించి వారిని తీవ్రంగా కొట్టి రూ.వెయ్యి లాక్కున్నారు. రామకృష్ణ ఫోన్లో బ్యాంక్ బ్యాలెన్స్ పరిశీలించి, ఏటీఎం సెంటర్‌కు వెళ్లి రూ. 5వేలు విత్‌డ్రా చేసి తేవాలని బెదిరించి పంపారు. అతడు వెళ్తూ రోడ్డు సేఫ్టీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దుండగులు పరారయ్యారు. ఫిర్యాదు మేకు కేసు దర్యాప్తు చేయగా దాకమర్రికి చెందిన కంటుభుక్త శ్రీను, కనకల యశ్వంత్, ముగడ శివలను నిందితులుగా గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశరావు, పోలీసులు ఎం.శివ, ఎం.రాజేష్, ఐ. గౌరినాయుడులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ విశాఖ రీజియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం నిర్వహించింది. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, పండ్లరసాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 42 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణీనీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జీవీ గౌరి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



తోగులురెడ్డి (ఫైల్)

తగరపువలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గణేష్ థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక భవంతిలో సెంటరింగ్ పనులు చేస్తున్న రిక్క తోగులురెడ్డి(25) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన తోగులురెడ్డి సాయంత్రం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు అన్నయ్యలు, ఒక చెల్లి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వృత్తి ఆధారిత శిక్షణ పొందడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కేపీ హేమమాలిని పేర్కొన్నారు. విశాఖ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శ్రీసత్యసాయి రైల్వే సమితి ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ కోర్సు పూర్తి చేసిన శిక్షణార్థులకు అవసరమైన పనిముట్లను బుధవారం అక్కయ్యపాలెంలోని శ్రీసత్యసాయి సౌధ మందిర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డాక్టర్ హేమమాలిని హాజరయ్యారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో రైల్వే సమితి, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఇన్‌చార్జిలు, సత్యసాయి సేవా సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

హడావిడిగా తాబేళ్ల హేచరీ ఏర్పాటు

- ఉన్నతాధికారుల చీవాట్లతో తొలగింపు
- అటవీశాఖలో కొందరి నిర్వాకం



ప్రస్తుతం ఉన్న ఇసుకలో పాతిన కర్రలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్లరక్షణకు అటవీశాఖ తొలి నుంచి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలు ఉన్నాయి. నిధులు లేవని సాగర్‌నగర్ ఒక్కచోట ఈ ఏడాదికి హేచరీస్‌ను ఏర్పాటు చేయడంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో రెండు రోజుల క్రితం హడావిడిగా కురుసుర మ్యూజియం, కోకోనట్ ఎరీనా మధ్య హేచరీస్ ఏర్పాటు చేశారు.

తాబేళ్ల గుడ్లు పొదిగేందుకు వీలుగా లోపలకు కుక్కలు, ఇతర జంతువులు ప్రవేశించకుండా కర్రలు, వెదురు తడకలతో పక్కాగా ఏర్పాటు చేయాలి. కానీ హడావిడిగా హేచరీస్ ఏర్పాటు చేశామని చెప్పుకునేందుకు ప్రయత్నించారు. హేచరీస్ ఏర్పాటు తరువాత ఉన్నతాధికారులు పరిశీలించి చీవాట్లు పెట్టారు. సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన హేచరీస్ మాదిరిగానే ఉండాలి తప్ప నాసిరకంగా ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. దీంతో వెంటనే ఏర్పాటు చేసిన తడకలు తీసేసి పక్కన పడేశారు. కేవలం ఇసుకలో పాతిన కర్రలు మాత్రమే ఉంచేశారు. చిత్తశుద్ధి లేకుండా హడావిడిగా ఏర్పాటుచేసిన హేచరీస్‌లో తాబేళ్ల గుడ్లకు రక్షణ ఎలా ఉంటుందని పర్యావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు.



పక్కన పడేసిన తడకలు

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర విజయవంతం చేయాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలి డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి జయబాబు పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కళాశాలల ఆవరణలు పరిశుభ్రం చేయాలని సూచించారు. కళాశాలల్లోని చెత్త, పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించి డస్టబిన్‌లో వేయాలన్నారు. విధిగా చెత్తను పారిశుధ్య సిబ్బందితో తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యం, పర్యావరణం మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.జయ, పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని.. మొహం చాటేసిన యువకుడు

- కుటుంబ సభ్యులకు ఇష్టం లేదంటూ మెసేజ్
- న్యాయం చేయాలంటూ యువకుడి ఇంటి ముందు ఆందోళన



రొంగలనాయుడుపాలెం యువకుడి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న స్వాతి, సీఐటీయూ నాయకులు



సురేశ్, స్వాతి

కె.కోటపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ డిగ్రీ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. అప్పటి నుంచి ప్రేమను కొనసాగిస్తూ ఎనిమిదేళ్ల తరువాత గుళ్లో పెళ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేశారు. కొన్నాళ్ల కాపురం చేసిన తరువాత యువకుడు చెప్పాపెట్టకుండా సొంతూరు వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆ యువతి గ్రామానికి వచ్చి, సీఐటీయూ నాయకుల సహకారంతో యువకుడి ఇంటి ముందు దర్నాకు దిగింది. సమాచారం అందు కున్న పోలీసులు వచ్చి, న్యాయం జరిగిలే చూస్తా మని హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కె.కోటపాడు మండలం రొంగలనాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేశ్, విశాఖలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి నగరంలోని కృష్ణా కళాశాలలో 2013-16 సంవత్సరాల్లో డిగ్రీ చదివారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. సుమారు ఎనిమిదేళ్ల పాటు ప్రేమించుకున్న వీరు గత ఏడాది అక్టోబరు 9వ తేదీన తగరపువలసలోని కొండపై వున్న రామాలయంలో స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. అదే నెల 16న మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మధురవాడలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం మొదలుపెట్టారు. రెండు నెలల తరువాత సురేశ్ రొంగలనాయుడుపాలెం వెళుతున్నట్టు ఆమెకు చెప్పాడు. రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో సురేశ్‌కు ఫోన్ చేసింది. మనం పెళ్లి చేసుకోవడం తన కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని, వారిని ఒప్పించి తిరిగి వస్తానని, అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలో స్వాతి ఇల్లు ఖాళీ చేసి పుట్టింటికి వెళ్లింది. సురేశ్ తనను పెళ్లి చేసుకుని, కొంతకాలం నుంచి మొహం చాటేస్తున్నాడని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని నగరంలోని సీఐటీయూ నేతలను కోరింది. వారి ద్వారా బుధ వారం రొంగల నాయుడుపాలెంలో సురేశ్ ఇంటికి చేరుకుని ఆందోళనకు చేపట్టింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారిని విడదీయడం న్యాయం కాదని, వారిద్దరినీ ఒకటి చేయడానికి సహకరించాలని సురేశ్ తండ్రి కొండబాబును సీఐటీయూ నాయకులు కోరారు. ఇందుకు ససేమిరా అన్న ఆయన.. తన ఇంటి వద్ద దర్నా చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారితో మాట్లాడారు. అన్ని విషయాలను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో స్వాతి ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, గండి నాయనబాబు, ఎర్ర దేవుడు, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలనాయుడు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో బుధవారం సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులో ఉన్నందున ఆన్‌లైన్ మోసాలు పెరిగాయన్నారు. ఓటీపీల ద్వారా ఆర్థిక మోసాలు జరుగుతున్నాయని అందుకే ఓటీపీలు ఎవరికి ఇవ్వకూడదన్నారు. అలాగే ఫోన్‌లకు వచ్చే లింకులు ఓపెన్ చేయకూడదని తెలిపారు. ఆర్టీసీ సేవలను కూడా వాట్సాప్‌లో అందించడం వల్ల సిబ్బంది మరింత అప్రమత్తంగా మెలగాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 955230009 ద్వారా ఆన్‌లైన్‌లో ఏపీఎస్‌ఆర్టీసీ టికెట్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్, అరుణ్ కుమార్, సూపర్‌వైజర్లు రామకృష్ణ, బిందు, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జోన్ 3, 5, 8లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే తాగు నీటి సరఫరా ప్రధాన 1000 ఎంఎం గల పీఎస్సీ పైపులైనుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఆర్ అండ్ బీ ఆఫీసు ఎదురుగా గల అంబేడ్కర్ కల్యాణ మండపం దగ్గర పైపులైన్‌కు మరమ్మతు చేస్తుండడంతో ఈ నెల 14న జోన్-3, 5, 8లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్టు వెల్లడించారు.

జోన్-3లో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్‌ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీ నగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకర్‌మఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్-16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియాస్, ఇందిరా గాంధీ, బొమ్మలైన్, 80 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

జోన్-5లో లక్ష్మీ నారాయణపురం 1,2, లెపర్స్ కాలనీ, కస్తూరి నగర్-1, శాంతినగర్-1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాశ్‌నగర్, మహాత్మా గాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, ఆరుంధతి నగర్, రాంజ్ ఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లే అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లే అవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతీనగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హౌస్సెన్ నగర్, ఆర్పీ పేటలలో నీటి సరఫరాకు అంతరాయం కలగుతుందన్నారు.

జోన్-8లో గల లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ పార్కు, సీడీ బ్లాక్ పార్కు, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ ప్రాంతాలకు రైవాడ తాగునీటి సరఫరా పథకం నుంచి వచ్చే బల్క్ వాటర్ సప్లైకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతవాసులు సహకరించాలని కోరారు.

బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన విద్యారులకు మొక్కల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవ వైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా స్థానిక రాణిచంద్రమణిదేవి ఆస్పతి అవరణలో గల బయోడైవర్సిటీ పార్కును బుధవారం మధురవాడలోని శ్రీనివాస్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. స్కూలు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు గౌతంసాయి సభ్యులతో పాటు 100 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా బయో డైవర్సిటీ పార్కును సందర్శించి పార్కులోని టానీ కోస్టర్ సీతాకోక చిలుక జీవిత చక్రాన్ని..అన్ని దశల గురించి తెలుసుకున్నారు. అనంతరం జీవవైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల కోసం వివరించారు. విద్యార్థులు సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి పులకించిపోయారు.

వైజ్ఞానిక రంగంలో డార్విన్ సేవలు అమోఘం

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ వైజ్ఞానిక రంగంలో అందించిన సేవలు అద్భుతమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ అన్నారు. బుధవారం కళాశాలలో డార్విన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జయతో పాటు పాటు పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జయ మాట్లాడుతూ డార్విన్ ఆలోచనలు చాలా గొప్పవన్నారు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం ఆధునిక జీవశాస్త్రాన్ని రూపొందించడమే కాకుండా భూమిపై ఉన్న జీవ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. డార్విన్ రాసిన 'ఆన్ ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్ బై మీన్స్ ఆఫ్ నేచురల్ సెలెక్షన్' గ్రంథం శాస్త్రీయ సైన్స్‌పై అవగాహనను విప్లవాత్మకంగా మార్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జి.విజయప్రతాప్, శాంతిప్రభ, భూషణ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిశ్రీకి గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్ అవార్డు



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న వాణిశ్రీ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ (సీఐటీడీ) గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్-25 అవార్డు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీకి వరించింది. హైదారాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా వాణిశ్రీ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడిలేని విద్య అందించేందుకు కృషి చేస్తున్నందుకు అవార్డు వచ్చిందన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 33.13 లక్షలు


ఆలయ మండపంలో కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి నగదు, కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో భక్తులు హుండీల ద్వారా రూ.33.13 లక్షలు సమర్పించారు. ఈ కానుకలను మహా మండపంలో బుధవారం లెక్కించారు. జనవరి 4 నుంచి ఫిబ్రవరి 12 వరకు హుండీ కానుకలు లెక్కించగా బంగారం 91 గ్రాములు, వెండి 881 గ్రాములు వచ్చినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. 58 యూఎస్ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు, 65 కెనడా డాలర్లు, ఇతర దేశాల కరెన్సీ లభించినట్లు పేర్కొన్నారు. ఏఈవో, ఆలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది, వన్ టౌన్ పోలీసులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండో జోన్ బర్మాక్యాంప్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 14న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకేనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఫలితంగా ఫీడర్ పరిధిలోని ఊర్వశి జంక్షన్, నలంద నగర్, దేవేంద్ర నగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయం, అశోక నగర్, గంగన్న నగర్, జోగారావు నగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వినియోగదారుల హక్కుల కమిషన్ వైస్ చైర్మన్‌గా విశ్వనాథం యాదవ్


విశ్వనాథంకు నియామక పత్రం అందిస్తున్న ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా విశ్వనాథం యాదవ్ నియమితులయ్యారు. చైర్మన్ శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో నియామక పత్రం, గుర్తింపు కార్డును బుధవారం నేషనల్ చైర్మన్ సాయి రమేష్ అందజేశారు. జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఆదినారాయణ రాజు నియమితులయ్యారు. విశ్వనాథం మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ త్రినాథ్ వచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ చైర్మన్ దాడి సత్యనారాయణ, నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరాజు, నేషనల్ డైరెక్టర్ దిలీప్ రాజ్, సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ సన్యాసిరావు, డివిజన్ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంల తనిఖీ


విజయనగరం-రాయగడ సెక్షన్‌లో నిర్మించిన ట్రాక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయగడ, విజయనగరం సెక్షన్‌లో వాల్తేరు రైల్వే డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, రాయగడ డీఆర్‌ఎం అమితాబ్ సింఘాల్ తనిఖీలు చేపట్టారు. రాయగడ స్టేషన్‌లో మౌలిక సదుపాయాల మెరుగుకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. సెక్షన్‌లోని సర్క్యులేటింగ్ ఏరియాలు, రిటైరింగ్ రూమ్స్, క్రూ లాబీ, ఆర్‌ఆర్‌ఐ క్యాబిన్, రిలే రూమ్, వెయిటింగ్ హాల్స్, ఫుడ్ స్టాల్స్, బుకింగ్, పార్శిల్ కార్యాలయాలు, రన్నింగ్ రూమ్స్, ట్రాక్షన్ డిపో, యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్ వ్యాన్‌లు, క్యారేజ్ డిపో, స్టేషన్ భవనాలను పరిశీలించి మెరుగుదలకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. లద్దా-జిమిడిపేట సెక్షన్, గజపతినగరం-కోమటిపల్లి సెక్షన్‌లోని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పరిశీలించి ప్రధాన వంతెనలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

... 5వ పేజీ తరువాయి

అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది..

పారిశుధ్య పనులు మెరుగుపరచండి

- వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడండి
- జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ హోదాలో తొలిసారి పర్యటించిన కలెక్టర్


వార్డుల పర్యటనలో అధికారులకు సూచనలు చేస్తున్న ఇంచార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయిన తరువాత ఇంచార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తొలిసారి బుధవారం వార్డుల్లో పర్యటించారు. రోడ్లపై వ్యర్థాలు, కాలువల్లో డెబ్రీస్‌లపై అధికారులను ఆరా తీశారు. నగరం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, దీనికి అన్ని విభాగాల వారు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. దీనిలో భాగంగా జోన్ 4, 5 లలోని 32, 41 వార్డులలోని జైల్ రోడ్డు, పండా వీధి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలలో అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాతజైల్ రోడ్డులో ఉన్న నైట్ ఫుడ్ సెంటర్ ప్రాంతాన్ని పరిశీలించి వ్యర్థాలు దుకాణాల వద్ద ఉన్న డస్ట్ బిన్‌లో వేసేలా దుకాణదారులకు సూచించాలన్నారు. పండా వీధి నివాసిత ప్రాంతంలో కాలువలు, రోడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చాలా చోట్ల రోడ్లపై వ్యర్థాలు అధికంగా కనిపిస్తుండడం గమనించి పారిశుధ్య సిబ్బందితో వాటిని వెంటనే తొలగించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న తీరుపై ఆరా తీశారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద వ్యర్థాలు వేస్తే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుధ్య నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటా సేకరిస్తున్న చెత్తను ఎప్పటికప్పుడే తరలించి నగరం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కాలువలు, రోడ్లపై వ్యర్థాలు వేయకుండా ఎప్పటికప్పుడు తొలగించడంతోపాటు జీవీఎంసీ అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపైన, ప్లాస్టిక్ నిషేధంపైన ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏఎంఓహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, బయాలజిస్టు సాంబమూర్తి, శానిటరీ సూపర్వైజర్లు జనార్దన్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం శానిటరీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మౌఖిక పరీక్ష సన్నద్ధతపై ఉద్యోగార్థులకు శిక్షణ



ఉద్యోగార్థులకు పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నఫీసా

సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగార్థులు మౌఖిక పరీక్షల్లో విజయం సాధించేందుకు వీలుగా ప్రతివారం ఇక్కడి పౌరగ్రంథాలయంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చారు. బృంద స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ అంశాలపై అవగాహన కల్పించారు. తమ జీవిత ప్రయాణాన్ని ప్రారంభించే యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి గ్రంథాలయ కార్యదర్శి డీఎస్ వర్మ ఈ శిక్షణ సమావేశాలు ప్రారంభించారు. 22 ఏళ్ల అనుభవం గల నఫీసా బరోడవాలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ సాధన చేసే యువత 'జస్ట్ ఏ మినిట్ (జామ్) సెషన్‌తో వారు తమ ఆలోచన సామర్థ్యాలకు పదును పెట్టుకుంటారని, సానుకూల దృక్పథం కోసం వారి శరీర కదలికలను మెరుగు పరుచుకుంటారన్నారు. ఈ నమూనా మౌఖిక పరీక్షతో అనుభవం వస్తుందన్నారు. ఇలాంటి యువత మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధిస్తారని పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా విద్యుత్ అధికారుల పరిశీలన

కంచరపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్ రైజ్ క్లబ్ వద్ద విద్యుత్ సిబ్బంది నిర్వహించిన ఆగమేఘాల పనులపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురించిన కథనానికి ఈపీడీసీఎల్ రెండో జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు స్పందించారు. పనులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కంచరపాలెం సబ్‌స్టేషన్ ఏడీఈ జీఎస్ సత్యనారాయణను ఆదేశించారు. అయితే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి వెళ్లిపోయారు. సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రధాన స్తంభం పూర్తిగా పాడైన నేపథ్యంలో మార్చినట్లు తెలిపారు.బిల్డింగ్ పనులు జరుగుతున్న స్తంభం వద్ద వైర్లను ముందుకు ఎందుకు జరిపారో అన్న అంశంపై నోరు మెదపలేదు. దీనిపైనే సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు అక్కడ ఏమి జరిగింది? అధికారులు ఎందుకు వచ్చారు? వారు పరిశీలించిన అంశాలపై వివరణ కోరగా సరైన సమాధానం రాకపోవడం గమనార్హం. దీని లోగుట్టు ఏమిటన్నది ఉన్నతాధికారులే బయటపెట్టాలి.

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు


ఇసుక కొండపై రమా సత్యనారాయణ స్వాములకు హారతి ఇస్తున్న అర్చకుడు


సత్యనారాయణస్వామి వ్రతం అనంతరం దర్శనం చేసుకుంటున్న భక్తులు


మురళీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో వైభవ వెంకటేశ్వర స్వామి

మహారాణిపేట/జగదాంబ కూడలి/మురళీనగర్/సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయంలో మాఘపౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. పౌర్ణమి ఆలయంగా పేరొందిన ఇక్కడ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో వేడుకలు నిర్వహించారు. వేకువ జాము నుంచే సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయం శ్రీమన్నారాయణ గోవింద నామస్మరణతో మారుమోగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, వ్రతాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఘాట్ రోడ్డు నుంచి కేజీహెచ్ మార్గంలో పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఈవో రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్యూ కాంప్లెక్సు ద్వారా ప్రవేశించారు. ధ్వజస్తంభానికి మొక్కి ఐదు ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. దంపతులు సామూహికంగా రమా సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్నారు. ఇలాంటివారికి శేషవస్త్రం, ప్రసాదం, వేద ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈవో రాజగోపాల్ రెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో చక్రార్చన, లక్ష్మీ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురళీనగర్ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి పంచామృతాభిషేకం, ఆర్జిత సేవలు చేశారు. మాడవీధుల్లో అభిషేక ప్రదక్షిణ నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈఓ బి.ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు శ్రీవారికి పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడికి, మహా శివ లింగానికి, సాయిబాబాకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.


నక్కవానిపాలెంలో అన్న సమారాధన

రక్తదానం ఎంతో ఉత్తమం: సీఎండీ పృథ్వీతేజ్


రక్తదానం చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ఎంతో ఉత్తమమైన లక్షణమని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీఈఈయూ 1104) ఆధ్వర్యంలో 76వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విద్యుత్ భవన్‌లో ఉచిత రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ పృథ్వీతేజ్ విచ్చేసి స్వయంగా రక్తదానం చేసి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రత్యేక అతిథులుగా డైరెక్టర్ హెచ్‌ఆర్‌డీ డి.చంద్రం, డైరెక్టర్ (ఆపరేషన్) వి.విజయలలిత, డైరెక్టర్ ప్రాజెక్టు పి.రమణచంద్రప్రసాద్, గౌరవ అతిథులుగా చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుమనకల్యాణి, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యామ్‌బాబు, రీజనల్ ప్రెసిడెంట్ ఎ.నూకరాజు, రీజనల్ సెక్రటరీ ఎస్.చిరంజీవులు, డిస్కమ్ కార్యదర్శి వీఎస్ఆర్‌కే గణపతి, అధ్యక్షులు బి.గురునాథరావు, బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాల టార్గెట్‌బాల్ విజేత ఏవీఎన్ కళాశాల

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషులు, మహిళల టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ తుది పోటీల్లో ఏవీఎన్ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. పురుషుల్లో ఏయూ ఆర్ట్స్ ప్రగతి కాలేజిలు... మహిళల్లో ప్రగతి, గాయత్రి విద్యాపరిషత్ ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు వ్యాయామ విద్య క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు డాక్టర్ సంధ్యారాణి, పి.కిషోర్, ఎస్.గోపీకృష్ణ, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో టమాటాకు తగ్గిన డిమాండ్


కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో టమాటాకు డిమాండ్ తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర తగ్గినా వినియోగదారులు కొనుగోలు చేయడం లేదని, దీంతో తాము చాలా నష్టపోతున్నామని వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం కురిసిన వర్షాలకు టమాటా పంట పూర్తిగా దెబ్బతినడంతో ధర పెరిగిందని, దీంతో టమాటాకు గిరాకీ కనిపించిందన్నారు. ఆ సమయంలో టమాటా లభించకపోయినా డ్వాక్రా సంఘాల వారు తీసుకొచ్చి వినియోగదారులకు విక్రయించేవారు. జనవరి నుంచి రైతులు పండించే టమాటాకు కనీసం రవాణా ఖర్చు కూడా రావడం లేదు. దీంతో వారు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి టమాటా పండించినా వాటికి గిట్టుబాటు ధర రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. కిలో టమాటా ధర రూ.10లకు విక్రయించినా కొనుగోలుదారులు విముఖత చూపిస్తున్నారు. టమాటాను వినియోగదారులు కొనుగోలు చేయకపోవడం వల్ల కుళ్లిపోతున్నాయని, వాటిని చెత్త బుట్టల్లో వేస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం మర్రివలసకు చెందిన ఓ రైతు వాపోయారు. రైతు బజార్‌లో టమాటా విక్రయ స్టాళ్లు కూడా తగ్గిపోయాయి.

వైసీపీ నేతల గుప్పెట్లోనే ఫిల్మ్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

లేదు. ఎమ్మెల్యేలపై నిజంగా గౌరవం ఉంటే ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అవకాశం ఇవ్వాలి. కానీ ఇప్పుడు ఇవ్వడమే అనుమానాలకు తావిస్తోంది. అక్కడితో ఆగకుండా జిల్లాలో పలువురు అధికారులకు కూడా ఉచిత సభ్యత్వాలు ఇచ్చారు. నగరంలోని ప్రముఖ క్లబ్‌లలో గ్రూప్-1 స్థాయి అధికారులకు ఉచిత సభ్యత్వాలు ఇచ్చే ఆనవాయితీ ఉంది. రెవెన్యూలో అయితే ఆర్‌డీఓ స్థాయి, ఆపై అధికారులకు, పోలీసులకైతే డీఎస్పీ ఆ స్థాయి అధికారులకు ఇవ్వాలి. కానీ ఈ క్లబ్ మాత్రం సీఐ స్థాయి అధికారులకు కూడా ఉచితంగా సభ్యత్వాలు ఇస్తోంది. ఈ గౌరవ, ఉచిత సభ్యత్వాలన్నీ (సుమారు 50) జనరల్ బాడీ మీటింగ్‌లో చర్చించకుండానే ఇచ్చారని పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో గొడవలపై ఎటువంటి కేసులు లేకుండా ఉండేందుకే అధికారులు అందరికీ ఉచిత సభ్యత్వాలు ఇచ్చారని విమర్శలు ఉన్నాయి.

పవన్‌కుమార్ చెప్పిందే వేదం

నగరంలో ఓ రెస్టారెంట్‌లో పనిచేసే పవన్ కుమార్ అనే యువకుడిని కార్యవర్గంలోని ఒక వ్యక్తి తీసుకువచ్చి క్లబ్‌లో ఆపరేషన్ మేనేజర్‌గా నియమించారు. అప్పటి నుంచి సభ్యులు ఎవరైనా ఏదైనా ఈవెంట్ పెట్టుకుంటే...వాటికి అవసరమైనవన్నీ క్లబ్ నుంచే తీసుకోవాలని చెబుతున్నారు. బయట నుంచి ఫుడ్, ఫొటోగ్రాఫర్, డెకరేషన్, సింగర్స్‌ని తెచ్చుకుంటే వారికి ఇచ్చే మొత్తంలో 20 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల డిసెంబరు 31న నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ఈవెంట్ నిర్వాహకులు కూడా రూమ్ అద్దె, ఫుడ్ బిల్లు కట్టాలని డిమాండ్ చేశారు. తాము ఈవెంట్ నిర్వహించడానికి వచ్చిన అతిథులమని, తమకు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత క్లబ్‌దని సదరు నిర్వాహకులు చెప్పగా, కార్యవర్గంతో మాట్లాడుకోవాలని, తనకు మాత్రం బిల్లు కట్టాలని పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. అక్కడ ఆయన మాటే వేదం. దీని వెనుక ఎవరు ఉన్నారనేది క్లబ్బులో అందరికీ తెలిసిందే.

నెల రోజులు గెస్ట్‌రూమ్‌లో...

పవన్‌కుమార్ ఇటీవల బయట ఎక్కడో ప్రమాదం జరిగి గాయపడ్డారు. క్లబ్‌లో సిబ్బందికి క్వార్టర్లు ఉన్నాయి. ఆయన్ను అక్కడ ఉంచి చికిత్స చేయించవచ్చు. కానీ అలా చేయకుండా క్లబ్‌లో ఐదు గెస్ట్ రూమ్‌లు ఉండగా అందులో ఒకటి ఆయనకు ఇచ్చారు. నెల రోజులు అందులో ఉంచారు. క్లబ్ నుంచే నెల రోజులూ ఆహారం పెట్టారు. ఆ రూమ్‌కి రోజుకు అద్దె సభ్యులకైతే రూ.2 వేలు. ఇతరులకైతే రూ.2,500. ఈ విషయం తెలిసి ఓ సభ్యుడు కార్యవర్గానికి లేఖ రాశారు. పవన్‌కుమార్ గెస్ట్ రూమ్ వాడడం వల్ల క్లబ్‌పై రూ.2.2 లక్షల భారం పడిందని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సిబ్బందిలో ఎవరు గాయపడినా ఇలాగే గెస్ట్‌రూమ్‌లో పెట్టి, చికిత్స చేస్తారా? ఫుడ్ పెడతారా? అని ప్రశ్నిస్తే...ఇప్పటివరకూ సమాధానం ఇవ్వలేదు. ఈ పవన్‌కుమారే క్లబ్‌కు అవసరమైన మెటీరియల్ అంతా కొంటారు. కిచెన్ ఇన్‌చార్జి ఆయనే. ఈవెంట్లకు ధరలు నిర్ణయించేదీ ఆయనే. ఒక వ్యక్తికి ఇన్ని బాధ్యతలు అప్పగించడమేమిటని పలువురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

మరికొన్ని ఆరోపణలు

- క్లబ్‌లో 50 సీసీ టీవీ కెమెరాలు పెట్టారు. వాటి ఫుటేజీ మొబైల్ యాక్సెస్‌ని కార్యవర్గంలో ఒక వ్యక్తి తీసుకున్నారు. సాధారణంగా ఇలాంటివి చైర్మన్, సెక్రటరీ స్థాయి వారికి యాక్సెస్ ఇస్తారు. ఆ వ్యక్తికి ఎవరు ఇచ్చారనే దానికి సమాధానం లేదు.
- క్లబ్‌కు రూ.40 కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నాయి. వీటిని ఇటీవల తరచూ బ్యాంకులు మారుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి కొందరు కీలక వ్యక్తులు ఈ డిపాజిట్లను ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

క్యాంపు నుంచి వచ్చాక మాట్లాడతా

కాయల వెంకట రెడ్డి, చైర్మన్

క్లబ్‌లో పదవికి రాజీనామా చేసిన అంశం నిజమా? కాదా? అని కాయల వెంకటరెడ్డికి ఫోన్ చేసి అడగగా అది ఇంకా ఆమోదం పొందలేదని సమాధానం ఇచ్చారు. ఇంకా అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పగా, తాను క్యాంపులో ఉన్నానని, వచ్చాక మాట్లాడతానని చెప్పారు.

స్వయం ఉపాధికి చేయూత

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం కేటాయించింది. అలాగే, కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రన్న స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు జిల్లాకు 452 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.96 లక్షలు కేటాయించింది. ఆయా యూనిట్లకు సంబంధించి కేటాయించిన మొత్తంలో 50 శాతం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం లభిస్తుంది. మొత్తంగా ఆయా కార్పొరేషన్లకు సంబంధించి 2,313 యూనిట్లు మంజూరు కాగా, ఇందులో బ్యాంకు రుణంగా రూ.27.21 కోట్లు, సబ్సిడీ రూ.27.21 కోట్లు కలిపి మొత్తంగా రూ.54.44 కోట్ల విలువైన యూనిట్లను మంజూరు చేసింది.

కోడ్ ముగిసిన తరువాతే...

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ ఆదేశాలతో వాయిదా వేశాం. కోడ్ ముగిసిన వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తాం. ఆయా కార్పొరేషన్లకు చెందినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిధులు వెనక్కి వెళతాయన్న భయం లేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆన్‌లైన్ బెనిఫీషియరీ మేనేజ్‌మెంట్ మానటరింగ్ సిస్టమ్ (ఓబీఎంఎంఎస్) ఓపెన్ అవుతుంది. అప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు.

-కె.శ్రీదేవి, ఇన్‌చార్జి బీసీ కార్పొరేషన్ ఈడీ

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కూడా ఏర్పాటవుతాయి.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలు భారీగా ఉంటున్నాయని, వాటి పరిష్కారం మాత్రం ఆ స్థాయిలో ఉండడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో అధికారులు వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ముఖ్యంగా రెవెన్యూ, భూ తగదాలు, ఇళ్ల సమస్యలు, నేరాలపై పోలీసులకు అందే ఫిర్యాదులే అధికంగా ఉంటున్నాయని లెక్కలు చెబుతున్నాయి. విశాఖ జిల్లా నుంచి 37,134 ఫిర్యాదులు అందగా, వాటిలో భూ తగాదాలకు చెందినవే ఎక్కువగా ఉండడం గమనార్హం. హౌస్ హోల్డ్ అర్జీల సంఖ్య 19,422గా ఉంది. సీఎంఓకు అందిన విశాఖ జిల్లా సమస్యలు 655. ప్రజలు సంతృప్తి చెందేలా ఫిర్యాదులు పరిష్కారం కావాలని సూచించిన నేపథ్యంలో అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

బర్డ్ ఫ్లూతో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తున్నారు. జిల్లాలో 20 వరకూ ఫారాలలో 3.44 లక్షల కోళ్లు ఉన్నాయని విశాఖ జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ డి.రామకృష్ణ అన్నారు. ఇప్పటివరకూ విశాఖ జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని పేర్కొన్నారు. అయినా ఫారాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చికెన్, గుడ్లు తినేవారంతా వాటిని బాగా ఉడికించాలని సూచించారు. తాజాగా వైరస్ ప్రభావంతో ఉత్తరాంధ్రలో గుడ్లు, చికెన్ వినియోగం స్వల్పంగా తగ్గిందని చిల్లర వర్తకులు చెబుతున్నారు.

పూర్ణామార్కెట్‌లో బినామీ దందాపై విచారణ

... 5వ పేజీ తరువాయి

దుకాణాల వద్దకు వెళ్లి అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయో ఆరా తీశారు. అనంతరం సంబంధితులతో మాట్లాడి...ఆ దుకాణాలు ఎలా వారికి వచ్చాయి, అందుకు ఎవరు సహకరించారనే వివరాలు రాబట్టారు. బినామీ దందాకు మార్కెట్ ఉన్న ప్రాంతంలో శానిటేషన్ ఉద్యోగే సహకారం అందించినట్టు ప్రాథమికంగా గుర్తించారని తెలిసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక తయారుచేసి జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ద్వారా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు అందజేయనున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశాలను బట్టి శానిటేషన్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ.నరేష్‌కుమార్‌కు సిఫారసు చేస్తామని జీవీఎంసీ అధికారి ఒకరు వివరించారు. అలాగే బినామీ పేర్లతో ఉన్న దుకాణాలను స్వాధీనం చేసుకుని బయట వ్యాపారం చేసుకుంటున్న వారిలో అర్హులైన వారికి ప్రాధాన్యతా క్రమంలో కేటాయిస్తామని జోన్-4 కమిషనర్ తెలిపారు. పూర్ణామార్కెట్‌లో వ్యాపారం చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సరే జోన్-4 కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి పూర్ణామార్కెట్ లోపల గ్యాంగ్ వేజ్‌లోని దుకాణాలను ఉచితంగానే కేటాయిస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. గ్యాంగ్ వేజ్ దుకాణాలు పెట్టుకునేవారు రోజుకు రూ.35 మాత్రమే ఆశీల్ జీవీఎంసీకి చెల్లించాలి. అంతకుమించి ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు.

'సూర్య ఘర్'కు అరకొర స్పందన

... 5వ పేజీ తరువాయి

పెట్టుకున్నారు. వాటి సామర్థ్యం 17,573 కిలోవాట్లు. ఆసక్తి చూపించిన వారిలో పది శాతం మంది కూడా వీటిని ఏర్పాటు చేసుకోకపోవడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

ఇదీ పథకం

నెలకు 120 యూనిట్లు ఉపయోగించేవారికి ఒక కిలోవాట్ సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తారు. ఈ యూనిట్‌కు రూ.60 వేలు ఖర్చవుతుంది. అందులో రూ.30 వేలు రాయితీగా వస్తుంది. నెలకు 240 యూనిట్లు వినియోగించేవారు రెండు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. వీరికి రూ.1.2 లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.60 వేలు రాయితీగా లభిస్తుంది. కాగా నెలకు 360 యూనిట్లు ఉపయోగిస్తే మూడు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. దీనికి రూ.1.8 లక్షలు పెట్టుబడి అవసరం. రాయితీ రూ.78 వేలు వస్తుంది.

నెలనెలా బిల్లు కట్టేస్తున్నాము కదా...ఇబ్బందులు లేవు. ఇప్పుడు సోలార్ పవర్ అని రూ.లక్షలు పెట్టుబడి దేనికి?, దీనివల్ల మిగిలేది ఏముంది?...ఒకవేళ సోలార్ ప్యానళ్లు ఏ తుఫాన్ గాలికో పాడైపోతే పరిస్థితి ఏమిటి?...అనే ఆలోచనలో కొంతమంది ముందుకురావడం లేదు. అధికారులు మాత్రం వచ్చే ఏడాది మార్చి వరకూ మాత్రమే ఈ పథకం అమలులో ఉంటుందని, ఆ లోగా ఉపయోగించుకుంటే 50 శాతం రాయితీ వస్తుందని చెబుతున్నారు. పేర్లు రిజిస్టర్ చేసుకున్నవారు దరఖాస్తు సమర్పిస్తే, ఆ తరువాత ప్రాసెస్ అంతా తాము చూసుకుంటామని హామీ ఇస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు 355 మంది విద్యార్థులు

- వెనుకబడిన విద్యార్థుల కోసం 42 మంది టీచర్లతో ప్రత్యేక బృందం
- తోటగరువు హెచ్‌ఎం దుర్గాభవానీ



ఆరిలోవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 2024-25 సంవత్సరానికి పదో తరగతి పరీక్షలకు 355 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు హెచ్‌ఎం దుర్గాభవానీ తెలిపారు. వీరిలో బాలికలు 165 మంది, బాలురు 190 మంది హాజరు కానున్నట్టు వెల్లడించారు. చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. వీరిని ఏ, బీ కేటగిరీలుగా విభజించి ప్రత్యేక బోధన చేస్తున్నట్టు చెప్పారు. మొత్తం 42 మంది ఉపాధ్యాయులకు ఈ బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. ఒక ఉపాధ్యాయుడికి ముగ్గురు, నలుగురు విద్యార్థుల చొప్పున బోధన సాగిస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన సాగిస్తున్నామన్నారు. గత ఏడాది 67 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

అలాగే జిల్లా కామన్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం ప్రీ-ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలు సోమవారంతో ముగుస్తాయని తెలిపారు. ఈ పరీక్షలో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు మరింత ప్రత్యేక తర్ఫీదు అందించి పరీక్షలకు సిద్ధం చేయనున్నట్టు హెచ్‌ఎం దుర్గాభవానీ తెలిపారు.

జీరో డిఫెక్ట్ .. జీరో ఎఫెక్ట్‌పై అవగాహన సదస్సు

సిరిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ - లీన్ సర్టిఫికేషన్'పై ఎలిగెంట్ హోటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ విశాఖపట్నం జోన్ వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి మాట్లాడుతూ ఉత్పత్తి విలువ, మార్కెట్ రీచ్‌ను మెరుగుపరచడంలో నాణ్యత, ధ్రువీకరణల ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌బీక్యూపీ సలహాదారు సి.వేణుగోపాల్ మాట్లాడుతూ భారతదేశంలో అక్రిడిటేషన్, ధృవీకరణ ప్రక్రియలలో క్యూసీఐ బోర్డులు, విభాగాల పాత్ర గురించి వివరించారు. క్యూసీఐ ఎంపానెల్డ్ నిపుణుడు వెంకట సత్యవినోద్ జెడ్ సర్టిఫికేషన్, లీన్ పథకాలపై వివరించారు. జెడ్ స్కీమ్‌లోని కీలక అంశాలపై ప్రస్తావించారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

రోడ్లపైనే నిర్మాణ సామగ్రి

- రోజుల తరబడి తొలగించకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు
- యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నా నోరు మెదపని అధికారులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో కేవలం స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలాలు మాత్రమే కాకుండా రోడ్డు సైతం ఆక్రమణలను గురవుతున్నాయి. ఎవరైనా ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఒక్కరోజు రోడ్డు పక్కన ఇంటి నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచితే వెంటనే విరుచుకు పడే టౌన్ ప్లానింగ్ సిబ్బంది.. రోజుల తరబడి రోడ్డుపైనే నిర్మాణ సామగ్రిని ఉంచి భారీ భవనాలను నిర్మిస్తున్నా వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కనే అమ్మకానికి వేసిన పిక్క, ఇసుక



హెచ్‌బీ కాలనీలో రోడ్డును ఆక్రమించి వేసిన ఇసుక

హెచ్‌బీ కాలనీలోని శివాలయం సమీపంలో గల రోడ్డుపై నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, కంకర, ఇటుకలను వేశారు. రోజులు గడుస్తున్నా తీయడం లేదు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా ఉందంటూ స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. దీనివల్ల ఈ మార్గంలో స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లే వాహన చోదకులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కంకర ఉండడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి సమయాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అంటున్నారు.

కేవలం ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే వారితోనే కాకుండా స్థానికంగా కొందరు రోడ్లపైనే ఇటుక, పిక్క, ఇసుక వంటివి వేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా సామగ్రిని రోడ్డు పక్కనే పోగు పెట్టి విక్రయాలు చేపడుతున్నారు. ఇలాంటి వారి వల్ల కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

ఇలా రోడ్ల పక్కనే నిర్మాణ సామగ్రి అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణ సామగ్రిని బహిరంగంగా విక్రయిస్తుంటే కారకులపై చర్యలు తీసుకొని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నట్టు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమై చొరవ చూపి ఈ రోడ్ల ఆక్రమణను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దారిదోపిడీ దొంగల అరెస్టు : చోరీ సొత్తు స్వాధీనం

భీమునిపట్నం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దాకమర్రి రోడ్డులో దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురిని భీమిలి పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనం, ఆటోను సీజ్ చేసారు. ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశ్ తెలిపిన వివరాల మేరకు.. దివీస్ కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కాళ్ళ లీలా వరప్రసాద్ ఈనెల 10న స్నేహితులు శీర రామకృష్ణ, కుంచాడ రాంబాబులతో కలిసి విజయనగరం వైపు వెళ్తుండగా దాకమర్రి వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డగించి వారిని తీవ్రంగా కొట్టి రూ.వెయ్యి లాక్కున్నారు. రామకృష్ణ ఫోన్లో బ్యాంక్ బ్యాలెన్స్ పరిశీలించి, ఏటీఎం సెంటర్‌కు వెళ్లి రూ. 5వేలు విత్‌డ్రా చేసి తేవాలని బెదిరించి పంపారు. అతడు వెళ్తూ రోడ్డు సేఫ్టీ పోలీసులకు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సమాచారం ఇవ్వడంతో దుండగులు పరారయ్యారు. ఫిర్యాదు మేకు కేసు దర్యాప్తు చేయగా దాకమర్రికి చెందిన కంటుభుక్త శ్రీను, కనకల యశ్వంత్, ముగడ శివలను నిందితులుగా గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశరావు, పోలీసులు ఎం.శివ, ఎం.రాజేష్, ఐ. గౌరినాయుడులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ విశాఖ రీజియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం నిర్వహించింది. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, పండ్లరసాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 42 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణినీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జీవీ గౌరి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

తగరపువలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గణేష్ థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక భవంతిలో సెంటరింగ్ పనులు చేస్తున్న రిక్క తేగులురెడ్డి(25) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విజయనగరం జిల్లా భోగాపురం



తోగులురెడ్డి (ఫైల్)

మండలం కొత్త చెరకుపల్లికి చెందిన తేగులురెడ్డి సాయంత్రం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు అన్నయ్యలు, ఒక చెల్లి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి శిక్షణతో మహిళలకు ఆర్థిక భరోసా

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వృత్తి ఆధారిత శిక్షణ పొందడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కేపీ హేమమాలిని పేర్కొన్నారు. విశాఖ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శ్రీసత్యసాయి రైల్వే సమితి ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ కోర్సు పూర్తి చేసిన శిక్షణార్థులకు అవసరమైన పనిముట్లను బుధవారం అక్కయ్యపాలెంలోని శ్రీసత్యసాయి సౌధ మందిర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డాక్టర్ హేమమాలిని హాజరయ్యారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో రైల్వే సమితి, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఇన్‌చార్జిలు, సత్యసాయి సేవా సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

హడావిడిగా తాబేళ్ల హేచరీ ఏర్పాటు

- ఉన్నతాధికారుల చీవాట్లతో తొలగింపు
- అటవీశాఖలో కొందరి నిర్వాకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్లరక్షణకు అటవీశాఖ తొలి నుంచి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలు ఉన్నాయి. నిధులు లేవని సాగర్‌నగర్ ఒక్కచోట ఈ ఏడాదికి హేచరీస్‌ను ఏర్పాటు చేయడంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో రెండు రోజుల క్రితం హడావిడిగా కురుసుర మ్యూజియం, కోకోనట్ ఎరీనా మధ్య హేచరీస్ ఏర్పాటు చేశారు.



ప్రస్తుతం ఉన్న ఇసుకలో పాతిన కర్రలు

తాబేళ్ల గుడ్లు పొదిగేందుకు వీలుగా లోపలకు కుక్కలు, ఇతర జంతువులు ప్రవేశించకుండా కర్రలు, వెదురు తడకలతో పక్కాగా ఏర్పాటు చేయాలి. కానీ హడావిడిగా హేచరీస్ ఏర్పాటు చేశామని చెప్పుకునేందుకు ప్రయత్నించారు. హేచరీస్ ఏర్పాటు తరువాత ఉన్నతాధికారులు పరిశీలించి చీవాట్లు పెట్టారు. సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన హేచరీస్ మాదిరిగానే ఉండాలి తప్ప నాసిరకంగా ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. దీంతో వెంటనే ఏర్పాటు చేసిన తడకలు తీసేసి పక్కన పడేశారు. కేవలం ఇసుకలో పాతిన కర్రలు మాత్రమే ఉంచేశారు. చిత్తశుద్ధి లేకుండా హడావిడిగా ఏర్పాటుచేసిన హేచరీస్‌లో తాబేళ్ల గుడ్లకు రక్షణ ఎలా ఉంటుందని పర్యావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు.



పక్కన పడేసిన తడకలు

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర విజయవంతం చేయాలి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలి డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి జయబాబు పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కళాశాలల ఆవరణలు పరిశుభ్రం చేయాలని సూచించారు. కళాశాలల్లోని చెత్త, పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించి డస్టబిన్‌లో వేయాలన్నారు. విధిగా చెత్తను పారిశుధ్య సిబ్బందితో తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యం, పర్యావరణం మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.జయ, పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న కృష్ణా కళాశాల సిబ్బంది

ప్రేమించి పెళ్లి చేసుకుని.. మొహం చాటేసిన యువకుడు

- కుటుంబ సభ్యులకు ఇష్టం లేదంటూ మెసేజ్
- న్యాయం చేయాలంటూ యువకుడి ఇంటి ముందు ఆందోళన

కె.కోటపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ డిగ్రీ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. అప్పటి నుంచి ప్రేమను కొనసాగిస్తూ ఎనిమిదేళ్ల తరువాత గుళ్లో పెళ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేశారు. కొన్నాళ్లు కాపురం చేసిన తరువాత యువకుడు చెప్పాపెట్టకుండా సొంతూరు వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆ యువతి గ్రామానికి వచ్చి, సీఐటీయూ నాయకుల సహకారంతో యువకుడి ఇంటి ముందు దర్నాకు దిగింది. సమాచారం అందు కున్న పోలీసులు వచ్చి, న్యాయం జరిగిలే చూస్తా మని హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరిమించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కె.కోటపాడు మండలం రొంగలనాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేశ్, విశాఖలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి నగరంలోని కృష్ణా కళాశాలలో 2013-16 సంవత్సరాల్లో డిగ్రీ చదివారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. సుమారు ఎనిమిదేళ్ల పాటు ప్రేమించుకున్న వీరు గత ఏడాది అక్టోబరు 9వ తేదీన తగరపువలసలోని కొండపై వున్న రామాలయంలో స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. అదే నెల 16న మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మధురవాడలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం



రొంగలనాయుడుపాలెం యువకుడి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న స్వాతి, సీఐటీయూ నాయకులు



సురేశ్, స్వాతి

మొదలుపెట్టారు. రెండు నెలల తరువాత సురేశ్ రొంగలనాయుడుపాలెం వెళుతున్నట్టు ఆమెకు చెప్పాడు. రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో సురేశ్‌కు ఫోన్ చేసింది. మనం పెళ్లి చేసుకోవడం తన కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని, వారిని ఒప్పించి తిరిగి వస్తానని, అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలో స్వాతి ఇల్లు ఖాళీ చేసి పుట్టింటికి వెళ్లింది. సురేశ్ తనను పెళ్లి చేసుకుని, కొంతకాలం నుంచి మొహం చాటేస్తున్నాడని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని నగరంలోని సీఐటీయూ నేతలను కోరింది. వారి ద్వారా బుధ వారం రొంగల నాయుడుపాలెంలో సురేశ్ ఇంటికి చేరుకుని ఆందోళనకు చేపట్టింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారిని విడదీయడం న్యాయం కాదని, వారిద్దరినీ ఒకటి చేయడానికి సహకరించాలని సురేశ్ తండ్రి కొండబాబును సీఐటీయూ నాయకులు కోరారు. ఇందుకు ససేమిరా అన్న ఆయన.. తన ఇంటి వద్ద ధర్నా చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారితో మాట్లాడారు. అన్ని విషయాలను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో స్వాతి ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, గండి నాయనబాబు, ఎర్ర దేవుడు, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో బుధవారం సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులో ఉన్నందున ఆన్‌లైన్ మోసాలు పెరిగాయన్నారు. ఓటీపీల ద్వారా ఆర్థిక మోసాలు జరుగున్నాయని అందుకే ఓటీపీలు ఎవరికి ఇవ్వకూడదన్నారు. అలాగే ఫోన్‌లకు వచ్చే లింకులు ఓపెన్ చేయకూడదని తెలిపారు. ఆర్టీసీ సేవలను కూడా వాట్సాప్‌లో అందించడం వల్ల సిబ్బంది మరింత అప్రమత్తంగా మెలగాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 955230009 ద్వారా ఆన్‌లైన్‌లో ఏపీఎస్ఆర్టీసీ టికెట్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్, అరుణ్ కుమార్, సూపర్‌వైజర్లు రామకృష్ణ, బిందు, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జోన్ 3, 5, 8లోని పలు ప్రాంతాల్లో

తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే తాగు నీటి సరఫరా ప్రధాన 1000 ఎంఎం గల పీఎస్సీ పైపులైనుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఆర్ అండ్ బీ ఆఫీసు ఎదురుగా గల అంబేడ్కర్ కల్యాణ మండపం దగ్గర పైపులైన్‌కు మరమ్మతు చేస్తుండడంతో ఈ నెల 14న జోన్-3, 5, 8లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్టు వెల్లడించారు.

జోన్-3లో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీ నగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్-16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియాస్, ఇందిరా గాంధీ, బొమ్మలైన్, 80 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

జోన్-5లో లక్ష్మీ నారాయణపురం 1,2, లెపర్స్ కాలనీ, కస్తూరి నగర్-1, శాంతినగర్-1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాశ్‌నగర్, మహాత్మా గాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, అరుంధతి నగర్, రాంజ్ ఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లే అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లే అవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతీనగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హౌస్సెన్ నగర్, ఆర్పీ పేటలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

జోన్-8లో గల లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ పార్కు, సీడీ బ్లాక్ పార్కు, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ ప్రాంతాలకు రైవాడ తాగునీటి సరఫరా పథకం నుంచి వచ్చే బల్క్ వాటర్ సప్లైకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతవాసులు సహకరించాలని కోరారు.

బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన విద్యారులకు మొక్కల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవ వైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా స్థానిక రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో గల బయోడైవర్సిటీ పార్కును బుధవారం మధురవాడలోని శ్రీనివాస్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. స్కూలు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు గౌతంసాయి సభ్యులతో పాటు 100 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా బయో డైవర్సిటీ పార్కును సందర్శించి పార్కులోని టానీ కోస్టర్ సీతాకోక చిలుక జీవిత చక్రాన్ని..అన్ని దశల గురించి తెలుసుకున్నారు. అనంతరం జీవవైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల కోసం వివరించారు. విద్యార్థులు సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి పులకించిపోయారు.

వైజ్ఞానిక రంగంలో డార్విన్ సేవలు అమోఘం

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ వైజ్ఞానిక రంగంలో అందించిన సేవలు అద్భుతమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ అన్నారు. బుధవారం కళాశాలలో డార్విన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జయతో పాటు పాటు పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జయ మాట్లాడుతూ డార్విన్ ఆలోచనలు చాలా గొప్పవన్నారు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం ఆధునిక జీవ శాస్త్రాన్ని రూపొందించడమే కాకుండా భూమిపై ఉన్న జీవ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. డార్విన్ రాసిన 'ఆన్ ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్ బై మీన్స్ ఆఫ్ నేచురల్ సెలెక్షన్' గ్రంథం శాస్త్రీయ సైన్స్‌పై అవగాహనను విప్లవాత్మకంగా మార్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జి.విజయప్రతాప్, శాంతిప్రభ, భూషణ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిశ్రీకి గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్ అవార్డు



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న వాణిశ్రీ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ (సీఐటీడీ) గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్-25 అవార్డు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీకి వరించింది. హైదారాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా వాణిశ్రీ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడిలేని విద్య అందించేందుకు కృషి చేస్తున్నందుకు అవార్డు వచ్చిందన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 33.13 లక్షలు



ఆలయ మండపంలో కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి నగదు, కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో భక్తులు హుండీల ద్వారా రూ.33.13 లక్షలు సమర్పించారు. ఈ కానుకలను మహా మండపంలో బుధవారం లెక్కించారు. జనవరి 4 నుంచి ఫిబ్రవరి 12 వరకు హుండీ కానుకలు లెక్కించగా బంగారం 91 గ్రాములు, వెండి 881 గ్రాములు వచ్చినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. 58 యూఎస్ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు, 65 కెనడా డాలర్లు, ఇతర దేశాల కరెన్సీ లభించినట్లు పేర్కొన్నారు. ఏఈవో, ఆలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది, వన్ టౌన్ పోలీసులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండో జోన్ బర్మాక్యాంప్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 14న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకేనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఫలితంగా ఫీడర్ పరిధిలోని ఊర్వశి జంక్షన్, నలంద నగర్, దేవేంద్ర నగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయం, అశోక నగర్, గంగన్న నగర్, జోగారావు నగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వినియోగదారుల హక్కుల కమిషన్ వైస్ చైర్మన్‌గా విశ్వనాథం యాదవ్



విశ్వనాథంకు నియామక పత్రం అందిస్తున్న ప్రతినిధులు

సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా విశ్వనాథం యాదవ్ నియమితులయ్యారు. చైర్మన్ శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో నియామక పత్రం, గుర్తింపు కార్డు ను బుధవారం నేషనల్ చైర్మన్ సాయి రమేష్ అందజేశారు. జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఆదినారాయణ రాజు నియమితులయ్యారు. విశ్వనాథం మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ త్రినాథ్ వచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ చైర్మన్ దాడి సత్యనారాయణ, నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరాజు, నేషనల్ డైరెక్టర్ దిలీప్ రాజ్, సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ సన్యాసిరావు, డివిజన్ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎంల తనిఖీ



విజయనగరం-రాయగడ సెక్షన్‌లో నిర్మించిన ట్రాక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయగడ, విజయనగరం సెక్షన్‌లో వాల్తేరు రైల్వే డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ తనిఖీలు చేపట్టారు. రాయగడ స్టేషన్‌లో మౌలిక సదుపాయాల మెరుగుకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. సెక్షన్‌లోని సర్క్యులేటింగ్ ఏరియాలు, రిటైరింగ్ రూమ్స్, క్రూ లాబీ, ఆర్ఆర్ఐ క్యాబిన్, రిలే రూమ్, వెయిటింగ్ హాల్స్, ఫుడ్ స్టాల్స్, బుకింగ్, పార్శిల్ కార్యాలయాలు, రన్నింగ్ రూమ్స్, ట్రాక్షన్ డిపో, యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్ వ్యాన్‌లు, క్యారేజ్ డిపో, స్టేషన్ భవనాలను పరిశీలించి మెరుగుదలకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. లడ్డా-జిమిడిపేట సెక్షన్, గజపతినగరం-కోమటిపల్లి సెక్షన్‌లోని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పరిశీలించి ప్రధాన వంతెనలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

... 5వ పేజీ తరువాయి

అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది..

పారిశుధ్య పనులు మెరుగుపరచండి

- వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడండి
- జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ హోదాలో తొలిసారి పర్యటించిన కలెక్టర్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయిన తరువాత ఇంచార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తొలిసారి బుధవారం వార్డుల్లో పర్యటించారు. రోడ్లపై వ్యర్థాలు, కాలువల్లో డెబ్రీస్‌లపై అధికారులను ఆరా తీశారు. నగరం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, దీనికి అన్ని విభాగాల వారు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. దీనిలో భాగంగా జోన్ 4, 5 లలోని 32, 41 వార్డులలోని జైల్ రోడ్డు, పండా వీధి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలలో అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాతజైల్ రోడ్డులో ఉన్న నైట్ ఫుడ్ సెంటర్ ప్రాంతాన్ని పరిశీలించి వ్యర్థాలు దుకాణాల వద్ద ఉన్న డస్ట్ బిన్‌లో వేసేలా దుకాణదారులకు సూచించాలన్నారు. పండా వీధి నివాసిత ప్రాంతంలో కాలువలు, రోడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చాలా చోట్ల రోడ్లపై



వార్డులపర్యటనలో అధికారులకు సూచనలు చేస్తున్న ఇంచార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

వ్యర్థాలు అధికంగా కనిపిస్తుండడం గమనించి పారిశుధ్య సిబ్బందితో వాటిని వెంటనే తొలగించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న తీరుపై ఆరా తీశారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద వ్యర్థాలు వేస్తే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుధ్య నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటా సేకరిస్తున్న చెత్తను ఎప్పటికప్పుడే తరలించి నగరం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కాలువలు, రోడ్లపై వ్యర్థాలు వేయకుండా ఎప్పటికప్పుడు తొలగించడంతోపాటు జీవీఎంసీ అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపైన, ప్లాస్టిక్ నిషేధంపైన ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏఎమ్‌ఓహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, బయాలజిస్టు సాంబమూర్తి, శానిటరీ సూపర్వైజర్లు జనార్దన్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం శానిటరీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మౌఖిక పరీక్ష సన్నద్ధతపై ఉద్యోగార్థులకు శిక్షణ



ఉద్యోగార్థులకు పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నఫీసా

సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగార్థులు మౌఖిక పరీక్షల్లో విజయం సాధించేందుకు వీలుగా ప్రతివారం ఇక్కడి పౌరగ్రంథాలయంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చారు. బృంద స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ అంశాలపై అవగాహన కల్పించారు. తమ జీవిత ప్రయాణాన్ని ప్రారంభించే యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి గ్రంథాలయ కార్యదర్శి డీఎస్ వర్మ ఈ శిక్షణ సమావేశాలు ప్రారంభించారు. 22 ఏళ్ల అనుభవం గల నఫీసా బరోడవాలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ సాధన చేసే యువత 'జస్ట్ ఏ మినిట్ (జామ్) సెషన్‌తో వారు తమ ఆలోచన సామర్థ్యాలకు పదును పెట్టుకుంటారని, సానుకూల దృక్పథం కోసం వారి శరీర కదలికలను మెరుగు పరుచుకుంటారన్నారు. ఈ నమూనా మౌఖిక పరీక్షతో అనుభవం వస్తుందన్నారు. ఇలాంటి యువత మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధిస్తారని పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా విద్యుత్ అధికారుల పరిశీలన

కంచరపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్ రైజ్ క్లబ్ వద్ద విద్యుత్ సిబ్బంది నిర్వహించిన ఆగమేఘాల పనులపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురించిన కథనానికి ఈపీడీసీఎల్ రెండో జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు స్పందించారు. పనులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కంచరపాలెం సబ్‌స్టేషన్ ఏడీఈ జీఎస్ సత్యనారాయణను ఆదేశించారు. అయితే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి వెళ్లిపోయారు. సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రధాన స్తంభం పూర్తిగా పాడైన నేపథ్యంలో మార్చినట్లు తెలిపారు.బిల్డింగ్ పనులు జరుగుతున్న స్తంభం వద్ద వైర్లను ముందుకు ఎందుకు జరిపారో అన్న అంశంపై నోరు మెదపలేదు. దీనిపైనే సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు అక్కడ ఏమి జరిగింది? అధికారులు ఎందుకు వచ్చారు? వారు పరిశీలించిన అంశాలపై వివరణ కోరగా సరైన సమాధానం రాకపోవడం గమనార్హం. దీని లోగుట్టు ఏమిటన్నది ఉన్నతాధికారులే బయటపెట్టాలి.

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు



ఇసుక కొండపై రమా సత్యనారాయణ స్వాములకు హారతి ఇస్తున్న అర్చకుడు



సత్యనారాయణస్వామి వ్రతం అనంతరం దర్శనం చేసుకుంటున్న భక్తులు



మురళీనగర్‌లో ప్రత్యేక అలంకరణలో వైభవ వెంకటేశ్వర స్వామి

మహారాణిపేట/జగదాంబ కూడలి/మురళీనగర్/సీతమ్మధార, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయంలో మాఘపౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. పౌర్ణమి ఆలయంగా పేరొందిన ఇక్కడ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో వేడుకలు నిర్వహించారు. వేకువ జాము నుంచే సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయం శ్రీమన్నారాయణ గోవింద నామస్మరణతో మారుమోగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, వ్రతాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఘాట్ రోడ్డు నుంచి కేజీహెచ్ మార్గంలో పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఈవో రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్యూ కాంప్లెక్సు ద్వారా ప్రవేశించారు. ధ్వజస్తంభానికి మొక్కి ఐదు ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. దంపతులు సామూహికంగా రమా సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్నారు. ఇలాంటివారికి శేషవస్త్రం, ప్రసాదం, వేద ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈవో రాజగోపాల్ రెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో చక్రార్చన, లక్ష్మీ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురళీనగర్ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి పంచామృతాభిషేకం, ఆర్జిత సేవలు చేశారు. మాడవీధుల్లో అభిషేక ప్రదక్షిణ నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈఓ బి.ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు శ్రీవారికి పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడికి, మహా శివ లింగానికి, సాయిబాబాకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



నక్కవానిపాలెంలో అన్న సమారాధన

రక్తదానం ఎంతో ఉత్తమం: సీఎండీ పృథ్వీతేజ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ఎంతో ఉత్తమమైన లక్షణమని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీఈఈయూ 1104) ఆధ్వర్యంలో 76వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విద్యుత్ భవన్‌లో ఉచిత రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ పృథ్వీతేజ్ విచ్చేసి స్వయంగా రక్తదానం చేసి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రత్యేక అతిథులుగా డైరెక్టర్ హెచ్ఆర్‌డీ డి.చంద్రం, డైరక్టర్ (ఆపరేషన్) వి.విజయలలిత, డైరెక్టర్ ప్రాజెక్టు పి.రమణచంద్రప్రసాద్, గౌరవ అతిథులుగా చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుమనకల్యాణి, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యామ్‌బాబు, రీజనల్ ప్రెసిడెంట్ ఎ.నూకరాజు, రీజనల్ సెక్రటరీ ఎస్.చిరంజీవులు, డిస్కమ్ కార్యదర్శి వీఎస్ఆర్‌కే గణపతి, అధ్యక్షులు బి.గురునాథరావు, బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు

అంతర్ కళాశాల టార్గెట్‌బాల్ విజేత ఏవీఎన్ కళాశాల

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషులు, మహిళల టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ తుది పోటీల్లో ఏవీఎన్ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. పురుషుల్లో ఏయూ ఆర్ట్స్ ప్రగతి కాలేజీలు... మహిళల్లో ప్రగతి, గాయత్రి విద్యాపరిషత్ ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు వ్యాయామ విద్య క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్లు డాక్టర్ సంధ్యారాణి, పి.కిషోర్, ఎస్.గోపీకృష్ణ, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో టమాటాకు తగ్గిన డిమాండ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో టమాటాకు డిమాండ్ తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర తగ్గినా వినియోగదారులు కొనుగోలు చేయడం లేదని, దీంతో తాము చాలా నష్టపోతున్నామని వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం కురిసిన వర్షాలకు టమాటా పంట పూర్తిగా దెబ్బతినడంతో ధర పెరిగిందని, దీంతో టమాటాకు గిరాకీ కనిపించిందన్నారు. ఆ సమయంలో టమాటా లభించకపోయినా డ్వాక్రా సంఘాల వారు తీసుకొచ్చి వినియోగదారులకు విక్రయించేవారు.



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతు

జనవరి నుంచి రైతులు పండించే టమాటాకు కనీసం రవాణా ఖర్చు కూడా రావడం లేదు. దీంతో వారు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి టమాటా పండించినా వాటికి గిట్టుబాటు ధర రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. కిలో టమాటా ధర రూ.10లకు విక్రయించినా కొనుగోలుదారులు విముఖత చూపిస్తున్నారు. టమాటాను వినియోగదారులు కొనుగోలు చేయకపోవడం వల్ల కుళ్లిపోతున్నాయని, వాటిని చెత్త బుట్టల్లో వేస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం మర్రివలసకు చెందిన ఓ రైతు వాపోయారు. రైతు బజార్‌లో టమాటా విక్రయ స్టాల్లు కూడా తగ్గిపోయాయి.

వైసీపీ నేతల గుప్పెట్లోనే ఫిల్మ్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

లేదు. ఎమ్మెల్యేలపై నిజంగా గౌరవం ఉంటే ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అవకాశం ఇవ్వాలి. కానీ ఇప్పుడు ఇవ్వడమే అనుమానాలకు తావిస్తోంది. అక్కడితో ఆగకుండా జిల్లాలో పలువురు అధికారులకు కూడా ఉచిత సభ్యత్వాలు ఇచ్చారు. నగరంలోని ప్రముఖ క్లబ్‌లలో గ్రూప్-1 స్థాయి అధికారులకు ఉచిత సభ్యత్వాలు ఇచ్చే ఆనవాయితీ ఉంది. రెవెన్యూలో అయితే ఆర్‌డీఓ స్థాయి, ఆపై అధికారులకు, పోలీసులకైతే డీఎస్పీ ఆ స్థాయి అధికారులకు ఇవ్వాలి. కానీ ఈ క్లబ్ మాత్రం సీఐ స్థాయి అధికారులకు కూడా ఉచితంగా సభ్యత్వాలు ఇస్తోంది. ఈ గౌరవ, ఉచిత సభ్యత్వాలన్నీ (సుమారు 50) జనరల్ బాడీ మీటింగ్‌లో చర్చించకుండానే ఇచ్చారని పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో గొడవలపై ఎటువంటి కేసులు లేకుండా ఉండేందుకే అధికారులు అందరికీ ఉచిత సభ్యత్వాలు ఇచ్చారని విమర్శలు ఉన్నాయి.

పవన్‌కుమార్ చెప్పిందే వేదం

నగరంలో ఓ రెస్టారెంట్‌లో పనిచేసే పవన్ కుమార్ అనే యువకుడిని కార్యవర్గంలోని ఒక వ్యక్తి తీసుకువచ్చి క్లబ్‌లో ఆపరేషన్ మేనేజర్‌గా నియమించారు. అప్పటి నుంచి సభ్యులు ఎవరైనా ఏదైనా ఈవెంట్ పెట్టుకుంటే...వాటికి అవసరమైనవన్నీ క్లబ్ నుంచే తీసుకోవాలని చెబుతున్నారు. బయట నుంచి ఫుడ్, ఫొటోగ్రాఫర్, డెకరేషన్, సింగర్స్‌ని తెచ్చుకుంటే వారికి ఇచ్చే మొత్తంలో 20 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల డిసెంబరు 31న నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ఈవెంట్ నిర్వాహకులు కూడా రూమ్ అద్దె, ఫుడ్ బిల్లు కట్టాలని డిమాండ్ చేశారు. తాము ఈవెంట్ నిర్వహించడానికి వచ్చిన అతిథులమని, తమకు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత క్లబ్‌దని సదరు నిర్వాహకులు చెప్పగా, కార్యవర్గంతో మాట్లాడుకోవాలని, తనకు మాత్రం బిల్లు కట్టాలని పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. అక్కడ ఆయన మాటే వేదం. దీని వెనుక ఎవరు ఉన్నారనేది క్లబ్బులో అందరికీ తెలిసిందే.

నెల రోజులు గెస్ట్‌రూమ్‌లో...

పవన్‌కుమార్ ఇటీవల బయట ఎక్కడో ప్రమాదం జరిగి గాయపడ్డారు. క్లబ్‌లో సిబ్బందికి క్వార్టర్లు ఉన్నాయి. ఆయన్ను అక్కడ ఉంచి చికిత్స చేయించవచ్చు. కానీ అలా చేయకుండా క్లబ్‌లో ఐదు గెస్ట్ రూమ్‌లు ఉండగా అందులో ఒకటి ఆయనకు ఇచ్చారు. నెల రోజులు అందులో ఉంచారు. క్లబ్ నుంచే నెల రోజులూ ఆహారం పెట్టారు. ఆ రూమ్‌కి రోజుకు అద్దె సభ్యులకైతే రూ.2 వేలు. ఇతరులకైతే రూ.2,500. ఈ విషయం తెలిసి ఓ సభ్యుడు కార్యవర్గానికి లేఖ రాశారు. పవన్‌కుమార్ గెస్ట్ రూమ్ వాడడం వల్ల క్లబ్‌పై రూ.22 లక్షల భారం పడిందని, దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సిబ్బందిలో ఎవరు గాయపడినా ఇలాగే గెస్ట్‌రూమ్‌లో పెట్టి, చికిత్స చేస్తారా? ఫుడ్ పెడతారా? అని ప్రశ్నిస్తే...ఇప్పటివరకూ సమాధానం ఇవ్వలేదు. ఈ పవన్‌కుమారే క్లబ్‌కు అవసరమైన మెటీరియల్ అంతా కొంటారు. కిచెన్ ఇన్‌చార్జి ఆయనే. ఈవెంట్లకు ధరలు నిర్ణయించేదీ ఆయనే. ఒక వ్యక్తికి ఇన్ని బాధ్యతలు అప్పగించడమేమిటని పలువురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

మరికొన్ని ఆరోపణలు

- క్లబ్‌లో 50 సీసీ టీవీ కెమెరాలు పెట్టారు. వాటి ఫుటేజీ మొబైల్ యాక్సెస్‌ని కార్యవర్గంలో ఒక వ్యక్తి తీసుకున్నారు. సాధారణంగా ఇలాంటివి చైర్మన్, సెక్రటరీ స్థాయి వారికి యాక్సెస్ ఇస్తారు. ఆ వ్యక్తికి ఎవరు ఇచ్చారనే దానికి సమాధానం లేదు.
- క్లబ్‌కు రూ.40 కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నాయి. వీటిని ఇటీవల తరచూ బ్యాంకులు మారుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి కొందరు కీలక వ్యక్తులు ఈ డిపాజిట్లను ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

క్యాంపు నుంచి వచ్చాక మాట్లాడతా
కాయల వెంకట రెడ్డి, చైర్మన్

క్లబ్‌లో పదవికి రాజీనామా చేసిన అంశం నిజమా? కాదా? అని కాయల వెంకటరెడ్డికి ఫోన్ చేసి అడగగా అది ఇంకా ఆమోదం పొందలేదని సమాధానం ఇచ్చారు. ఇంకా అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పగా, తాను క్యాంపులో ఉన్నానని, వచ్చాక మాట్లాడతానని చెప్పారు.

స్వయం ఉపాధికి చేయూత

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం కేటాయించింది. అలాగే, కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చంద్రన్న స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు జిల్లాకు 452 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.96 లక్షలు కేటాయించింది. ఆయా యూనిట్లకు సంబంధించి కేటాయించిన మొత్తంలో 50 శాతం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం లభిస్తుంది. మొత్తంగా ఆయా కార్పొరేషన్లకు సంబంధించి 2,313 యూనిట్లు మంజూరు కాగా, ఇందులో బ్యాంకు రుణంగా రూ.27.21 కోట్లు, సబ్సిడీ రూ.27.21 కోట్లు కలిపి మొత్తంగా రూ.54.44 కోట్ల విలువైన యూనిట్లను మంజూరు చేసింది.

కోడ్ ముగిసిన తరువాతే...

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ ఆదేశాలతో వాయిదా వేశాం. కోడ్ ముగిసిన వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తాం. ఆయా కార్పొరేషన్లకు చెందినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిధులు వెనక్కి వెళతాయన్న భయం లేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానటరింగ్ సిస్టమ్ (ఓబీఎంఎంఎస్) ఓపెన్ అవుతుంది. అప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు.

-కె.శ్రీదేవి, ఇన్‌చార్జి బీసీ కార్పొరేషన్ ఈడీ

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కూడా ఏర్పాటవుతాయి.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలు భారీగా ఉంటున్నాయని, వాటి పరిష్కారం మాత్రం ఆ స్థాయిలో ఉండడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో అధికారులు వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ముఖ్యంగా రెవెన్యూ, భూ తగదాలు, ఇళ్ల సమస్యలు, నేరాలపై పోలీసులకు అందే ఫిర్యాదులే అధికంగా ఉంటున్నాయని లెక్కలు చెబుతున్నాయి. విశాఖ జిల్లా నుంచి 37,134 ఫిర్యాదులు అందగా, వాటిలో భూ తగాదాలకు చెందినవే ఎక్కువగా ఉండడం గమనార్హం. హౌస్ హోల్డ్ అర్జీల సంఖ్య 19,422గా ఉంది. సీఎంఓకు అందిన విశాఖ జిల్లా సమస్యలు 655. ప్రజలు సంతృప్తి చెందేలా ఫిర్యాదులు పరిష్కారం కావాలని సూచించిన నేపథ్యంలో అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

బర్డ్ ఫ్లూతో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

కల్పిస్తున్నారు. జిల్లాలో 20 వరకూ ఫారాలలో 3.44 లక్షల కోళ్లు ఉన్నాయని విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డి.రామకృష్ణ అన్నారు. ఇప్పటివరకూ విశాఖ జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని పేర్కొన్నారు. అయినా ఫారాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చికెన్, గుడ్లు తినేవారంతా వాటిని బాగా ఉడికించాలని సూచించారు. తాజాగా వైరస్ ప్రభావంతో ఉత్తరాంధ్రలో గుడ్లు, చికెన్ వినియోగం స్వల్పంగా తగ్గిందని చిల్లర వర్తకులు చెబుతున్నారు.

పూర్ణామార్కెట్‌లో బినామీ దందాపై విచారణ

... 5వ పేజీ తరువాయి

దుకాణాల వద్దకు వెళ్లి అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయో ఆరా తీశారు. అనంతరం సంబంధితులతో మాట్లాడి...ఆ దుకాణాలు ఎలా వారికి వచ్చాయి, అందుకు ఎవరు సహకరించారనే వివరాలు రాబట్టారు. బినామీ దందాకు మార్కెట్ ఉన్న ప్రాంతంలో శానిటేషన్ ఉద్యోగే సహకారం అందించినట్టు ప్రాథమికంగా గుర్తించారని తెలిసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక తయారుచేసి జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ద్వారా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు అందజేయనున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశాలను బట్టి శానిటేషన్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఐ.నరేష్‌కుమార్‌కు సిఫారసు చేస్తామని జీవీఎంసీ అధికారి ఒకరు వివరించారు. అలాగే బినామీ పేర్లతో ఉన్న దుకాణాలను స్వాధీనం చేసుకుని బయట వ్యాపారం చేసుకుంటున్న వారిలో అర్హులైన వారికి ప్రాధాన్యతా క్రమంలో కేటాయిస్తామని జోన్-4 కమిషనర్ తెలిపారు. పూర్ణామార్కెట్‌లో వ్యాపారం చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సరే జోన్-4 కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి పూర్ణామార్కెట్ లోపల గ్యాంగ్ వేజ్‌లోని దుకాణాలను ఉచితంగానే కేటాయిస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. గ్యాంగ్ వేజ్ దుకాణాలు పెట్టుకునేవారు రోజుకు రూ.35 మాత్రమే ఆశీల్ జీవీఎంసీకి చెల్లించాలి. అంతకుమించి ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు.

'సూర్య ఘర్'కు అరకొర స్పందన

... 5వ పేజీ తరువాయి

పెట్టుకున్నారు. వాటి సామర్థ్యం 17,573 కిలోవాట్లు. ఆసక్తి చూపించిన వారిలో పది శాతం మంది కూడా వీటిని ఏర్పాటు చేసుకోకపోవడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

ఇదీ పథకం

నెలకు 120 యూనిట్లు ఉపయోగించేవారికి ఒక కిలోవాట్ సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తారు. ఈ యూనిట్‌కు రూ.60 వేలు ఖర్చవుతుంది. అందులో రూ.30 వేలు రాయితీగా వస్తుంది. నెలకు 240 యూనిట్లు వినియోగించేవారు రెండు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. వీరికి రూ.1.2 లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.60 వేలు రాయితీగా లభిస్తుంది. కాగా నెలకు 360 యూనిట్లు ఉపయోగిస్తే మూడు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. దీనికి రూ.1.8 లక్షలు పెట్టుబడి అవసరం. రాయితీ రూ.78 వేలు వస్తుంది.

నెలనెలా బిల్లు కట్టేస్తున్నాము కదా...ఇబ్బందులు లేవు. ఇప్పుడు సోలార్ పవర్ అని రూ.లక్షలు పెట్టుబడి దేనికి?, దీనివల్ల మిగిలేది ఏముంది?...ఒకవేళ సోలార్ ప్యానళ్లు ఏ తుఫాన్ గాలికో పాడైపోతే పరిస్థితి ఏమిటి?...అనే ఆలోచనలో కొంతమంది ముందుకురావడం లేదు. అధికారులు మాత్రం వచ్చే ఏడాది మార్చి వరకూ మాత్రమే ఈ పథకం అమలులో ఉంటుందని, ఆ లోగా ఉపయోగించుకుంటే 50 శాతం రాయితీ వస్తుందని చెబుతున్నారు. పేర్లు రిజిస్టర్ చేసుకున్నవారు దరఖాస్తు సమర్పిస్తే, ఆ తరువాత ప్రాసెస్ అంతా తాము చూసుకుంటామని హామీ ఇస్తున్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన హెచ్ఎం కాంతం, తదితరులు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని అక్కిరెడ్డిపాలెం హై స్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. టీడీపీ 68వ వార్డు నాయకులు బుధవారం హై స్కూల్‌లోని టెన్త్ విద్యార్థుల కోసం అందజేసిన స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొప్ప అప్పలరాజు, మురళీ, టి.గోవింద్, అప్పలరాజు, మూర్తి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద బోర్డు ఏర్పాటు చేయాలి

అగనంపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి ప్రశాంతినగర్ సచివాలయం వద్ద ఎటువంటి బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు భవనం పైఅంతస్థులో సచివాలయ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనం కింద మొత్తం దుకాణ సముదాయం ఉండడంతో పౌర సేవల కోసం వచ్చే ప్రజలు సచివాలయాన్ని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. సచివాలయాన్ని తెలిపేలా గతంలో ఏర్పాటు చేసిన బోర్డు గతంలో వీచిన బలమైన గాలులకు పాడైపోవడంతో సిబ్బంది దానిని తొలగించారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా సచివాలయం వద్ద బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. దీంతో నిత్యం ఇక్కడకు వచ్చే ప్రజలకు సచివాలయం ఎక్కడ ఉందో అర్థం కాని పరిస్థితి దాపురించింది. తక్షణమే సచివాలయాన్ని తెలిపేలా ఇక్కడ బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

15న ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్తుల ఆరాధ్య దైవం పోలమాంబ ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఈ నెల 15న ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు గ్రామ పురవీధుల్లో సారె ఊరేగింపు చేపట్టనున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి, మాజీ సర్పంచ్ సన్యాసి అప్పారావు తెలిపారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళదుంపలు 15, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 80, అల్లం 40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లుల్లి 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడుచిక్కుడు 28, గోరుచిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

శత శాతం పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- జీవీఎంసీ గాజువాక జోన్‌లో మొండి బకాయిల వసూలు కోసం వార్డుల్లో స్పెషల్ డ్రైవ్
- ఆర్ఐ, బిల్ కలెక్టర్ సచివాలయ సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటు



గాజువాక జోనల్ కార్యాలయంలో పన్నులు చెల్లిస్తున్న ప్రజలు

గాజువాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) గాజువాక జోనల్‌లో శత శాతం ఆస్తి పన్నుల వసూళ్లపై జోనల్ రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో పన్నుల వసూళ్లే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. గాజువాక జోనల్ పరిధిలో సుమారు లక్షా 26 వేల మేర అసెస్‌మెంట్లు ఉండగా.. ఏడాదికి ఆస్తి పన్ను రూపంలో రూ.38 కోట్ల 50 లక్షల పైచిలుకు ఆదాయం జీవీఎంసీకి వస్తుంది. కాగా ఇప్పటివరకు రూ.27 కోట్ల పైబడి పన్ను వసూలైంది. ఇంకా రూ.11 కోట్ల పైబడి వసూలు కావాల్సి ఉండడంతో వార్డులవారీగా ఎంత మేర బకాయి ఉంది, మొండి బకాయిదారులు ఎంతమంది ఉన్నారో జాబితా సిద్ధం చేశారు. ఆర్ఐ, బిల్లు కలెక్టర్లు, సచివాలయ సిబ్బందితో కూడిన బృందాలు ఆయా వార్డుల్లో తిరుగుతూ పన్నులను వసూలు చేస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన మొండి బకాయిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. కొంత గడువు ఇచ్చి, అప్పటికీ పన్ను చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి ఆస్తులు సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. పన్ను వసూళ్లకు సంబంధించి జోనల్ కమిషనర్ శేషాద్రి ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ వారికి దిశానిర్దేశం చేస్తున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి: జోనల్ కమిషనర్ శేషాద్రి



ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ శేషాద్రి హెచ్చరించారు. మొండి బకాయిదారుల విషయంలో ఉపేక్షించబోమన్నారు. ఎక్కువ మొత్తంలో పన్ను బకాయిలు ఉన్నవారికి నోటీసులు ఇచ్చి కొద్ది రోజులు గడువు ఇస్తున్నాం. అప్పటికీ చెల్లించకుంటే ఆస్తులు సీజ్ చేస్తాం.

'కార్మిక హక్కులను కాపాడడమే బీఎంఎస్ లక్ష్యం'



బీఎంఎస్ 70 వసంతాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, ఇతర వర్గాల హక్కుల కోసం ఏడు దశాబ్దాలుగా తాము పోరాటాలు చేస్తున్నామని బీఎంఎస్ సీనియర్ నాయకులు గొందేశి ఎరుకునాయుడు, పల్లం కొండలరావులు అన్నారు. బీఎంఎస్ 70 వసంతాల వేడుకలను యూనియన్ పారిశ్రామిక ప్రాంత శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాత అయ్యన్నపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడేందుకు, పేదలకు కూడు, గుడ్డ, ఇళ్ల కోసం ప్రభుత్వాలతోనే బీఆర్ఎస్ పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి గొందేశి గురప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూనియన్ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

చిన్నారులకు మంచి 'భవిత'ను ఇచ్చేందుకు కృషి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలోని చిన్నారులకు మంచి భవిష్యత్తును ఇచ్చేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయని ఎంఈవో కె.రమణాజీ అన్నారు. పెదగంట్యాడ భవిత కేంద్రంలోని విద్యార్థుల కోసం ములగాడకు చెందిన సంఘ సేవకురాలు హిమబిందు టీచింగ్, లెర్నింగ్ సామగ్రిని అందజేయగా, ఎంఈవో బుధ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవిటి, బధిర, మూగ పిల్లల మానసిక వికాసానికి ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జయభారతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోన్ 3, 5, 8లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే తాగు నీటి సరఫరా ప్రధాన 1000 ఎంఎం గల పీఎస్సీ పైపులైనుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఆర్అండ్‌బీ ఆఫీసు ఎదురుగా గల అంబేడ్కర్ కల్యాణ మండపం దగ్గర పైపులైన్‌కు మరమ్మతులు చేస్తుండడంతో ఈ నెల 14న జోన్-3, 5, 8లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు తాగునీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్టు వెల్లడించారు. జోన్-3లో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీ నగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకర్‌మఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్-16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియాస్, ఇందిరా గాంధీ, బొమ్మలైన్, 80 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

అదేవిధంగా జోన్-5లో లక్ష్మీ నారాయణపురం 1,2, లెపర్స్ కాలనీ, కస్తూరి నగర్-1, శాంతినగర్-1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాశ్‌నగర్, మహాత్మా గాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, ఆరుంధతి నగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లే అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లే అవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతీనగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హుస్సేన్ నగర్, ఆర్పీ పేటలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

జోన్-8లో గల లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ పార్కు, సీడీ బ్లాక్ పార్కు, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ ప్రాంతాలకు రైవాడ తాగునీటి సరఫరా పథకం నుంచి వచ్చే బల్క్ వాటర్ సప్లైకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతవాసులు సహకరించాలని కోరారు.

మాఘ పౌర్ణమి పూజలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తుంగ్లాంలోని దుర్గాదేవి ఆలయంలో, షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి ఆలయంలో వేదపండితులు పసుపు, కుంకుమలతో అమ్మవారికి పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎస్టీబీఎల్‌లో శ్రీవారి పల్లకీ సేవను సాయంత్రం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఉభయ దేవేరులతో శ్రీవారి పల్లకీ సేవ సాగింది.

కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయలేం

- షిప్‌యార్డు యాజమాన్యానికి స్పష్టం చేసిన మాజీ ఉద్యోగుల సొసైటీ కార్యవర్గం



షిప్‌యార్డు ప్రవేశ ద్వారం

మల్కాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహించే మాజీ ఉద్యోగుల సొసైటీ కార్మికుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరుతో 1984లో సొసైటీ ఏర్పాటయింది. షిప్‌యార్డులో ఉద్యోగ విరమణ పొందిన, స్వచ్ఛంద విరమణచేసిన పిల్లలకు ఉపాధి కల్పించి, రిటైర్డ్ ఉద్యోగి కుటుంబానికి ఊతం ఇచ్చేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు షిప్‌యార్డులో వర్క్ ఆర్డర్‌పై సొసైటీ కార్మికులకు పని కల్పించేవారు. వర్క్ ఆర్డర్ అంటే ఏడాది పొడవునా పని ఉంటుంది). దీంతో ఎవరికీ ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగేది. అయితే ఇటీవల యాజమాన్యం కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టు పద్ధతిలో వారు పిలిచినప్పుడే పని ఉంటుంది. లేదంటే ఖాళీ. వేతనం రాదు. దీంతో ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని కార్మికులు వాపోతున్నారు. ఏళ్లుగా షిప్‌యార్డును నమ్ముకుని బతుకుతున్నామని, ఇప్పుడు పద్ధతి మారిస్తే జీవితాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయలేమని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం సొసైటీలో 272 మంది ఉన్నారు. అయితే యాజమాన్యం ఇటీవల నిర్వహించిన సమావేశంలో కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేయాలని కోరింది. దీంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ నేపథ్యంలో పాత పద్ధతిలోనే సొసైటీ నడిచేలా అధికారులు సహకరించాలని కార్మికులు కోరారు. ఉద్యోగులతో సమానంగా సంస్థ అభివృద్ధికి పనిచేస్తున్నామని, సొసైటీ కార్మికులను నష్టపరిచే నిర్ణయాలు దారుణమని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని.. మొహం చాటేసిన యువకుడు

- కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని మెసేజ్
- అతడి ఇంటి ముందు ఆందోళన



యువకుడి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితురాలు స్వాతి, సీఐటీయూ నాయకులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ డిగ్రీలో ప్రేమలో పడ్డారు. ఎనిమిదేళ్ల తరువాత గుళ్లో పెళ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. కొన్నాళ్లు కాపురం చేసిన తరువాత యువకుడు సొంతూరు వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆ యువతి గ్రామానికి వచ్చి, సీఐటీయూ నాయకుల సహకారంతో యువకుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు న్యాయం జరిగేలే చూస్తామని హామీ ఇచ్చారు. కె.కోటపాడు మండలం రొంగలనాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేశ్, విశాఖలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి నగరంలోని కృష్ణా కళాశాలలో 2013-16 మధ్య డిగ్రీ చదివారు. ఈ సమయంలో ప్రేమించుకుని గత ఏడాది అక్టోబరు 9న తగరపువలసలోని కొండపై వున్న రామాలయంలో పెళ్లి చేసుకున్నారు. అదే నెల 16న మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మధురవాడలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు. రెండు నెలల తరువాత సురేశ్ రొంగలనాయుడుపాలెం వెళుతున్నట్టు చెప్పాడు. రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో ఫోన్ చేసింది. మన పెళ్లి కుటుంబసభ్యులకు ఇష్టం లేదని, వారిని ఒప్పించి వస్తానని చెప్పాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలో స్వాతి ఇల్లు ఖాళీ చేసి పుట్టింటికి వెళ్లింది. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని నగరంలోని సీఐటీయూ నేతలను కోరింది. బుధవారం సురేశ్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగింది. వారిని ఒకటి చేసేలా సహకరించాలని సురేశ్ తండ్రి కొండబాబును సీఐటీయూ నాయకులు కోరారు. ఇందుకు ససేమిరా అన్న ఆయన.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల వారితో మాట్లాడారు. న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో స్వాతి ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, గండి నాయనబాబు, ఎర్ర దేవుడు, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శివశివానీ విగ్రహ ప్రతిష్ఠ





సరిపల్లిలో శివ శివానీ విగ్రహాలు, కొత్తపాలెంలో ఉత్సవాలకు సిద్ధం చేసిన గౌరీపరమేశ్వర ఉత్సవ మూర్తులు

పెందుర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లి స్వయంభూ మల్లేశ్వరస్వామి శివాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శివశివానీ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. యాగశాలలో వేద పండితులు రాపర్తి నరేంద్ర ఘనాపాఠి పర్యవేక్షణలో రుత్వికులు, యాగకర్తలు సర్పంచ్ గొర్లె రామకృష్ణ, జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ దంపతులు విఘ్నేశ్వర పూజ, కర్మణ పుణ్యాహవచనం, శిలాధాతు, రత్నమూర్తి న్యాసం, న్యాసాంగహోమం నిర్వహించారు. భూదాత తిరుపతయ్య కుటుంబీ కుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి ఇచ్చారు. కుంభాభిషేకం, ధేను దిష్టి కుంభ, బింబ దర్శనం అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

15న కొత్తపాలెం గౌరీ సంబరాలు

గోపాలపట్నం: కొత్తపాలెం గ్రామంలోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ (గైరమ్మ) సంబరాలు ఈ నెల 15న అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రేటర్ 89వ వార్డు కొత్తపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో గౌరీ రామాలయంలో ఏటా కార్తీక మాసంలో ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఫిబ్రవరి రెండో శనివారం వరకూ పూజలు నిర్వహిస్తారు. ఆ నెల రెండు లేదా మూడో శనివారం ఉత్సవమూర్తుల అనుపు మహోత్సం సందర్భంగా గైరమ్మ సంబరాలు పరిసర ప్రాంతాలకే తలమానికంగా నిర్వహిస్తారు. పలు రకాల పిండివంటలు, మిఠాయిలతో అమ్మవారి సారెను పురవీధుల్లో ఊరేగిస్తారు. ఉత్సవం సందర్భంగా శనివారం రాత్రి ఉత్సవ మూర్తులను వైభవంగా ఊరేగిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తులతో రహదారులు కిక్కిరిసి పోతాయి.



ఇండస్ట్రియల్ ఎస్టేట్ స్టాక్ యార్డుల వద్ద నినాదాలు చేస్తున్న ప్రజలు

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని ఆందోళన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పారిశ్రామిక వాడలోని స్టాకు యార్డుల నుంచి వస్తున్న కాలుష్యంతో తాము ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని సత్యనారాయణపురం, పాత పెదంట్యాడ, గొడ్డువానిపాలెం, గొందేశి వీధి, కండిపిల్లి వీధి ప్రాంతాలకు చెందిన ప్రజలు బుధవారం ఆందోళనకు దిగారు. తమ ప్రాంతాల నుంచి పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ స్టాక్ యార్డుల వద్దకు వచ్చి వారు నిరసన వ్యక్తం చేశారు. కెమికల్ మెటీరియల్ యార్డులు, కోల్ యార్డులు, స్టీల్ యార్డుల నుంచి వస్తున్న కాలుష్యంతో తాము నానాపాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీల పెద్ద గొందేశి పైడిరెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం 260 ఎకరాలను సేకరించిందని, ఆ భూమిని ఏపీఐఐసీ వారికి అప్పగిస్తే స్టీల్‌ప్లాంట్ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఉత్సాహం చూపిన పారిశ్రామికవేత్తలకు కేటాయించడం జరిగిందన్నారు. అయితే పారిశ్రామికవేత్తలు ఈ భూమిని స్టాక్ యార్డుల నిర్వాహకులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇక్కడి కాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తామంతా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కలవల రమణ, దల్లి అప్పలరెడ్డి, సీహెచ్ తమ్మయ్యరెడ్డి, పురుషోత్తం, అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి అనుమతివ్వాలి



తుంగ్లాంలో ర్యాలీ చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాంలో కాలనీలో తారక రామ కల్యాణమండప నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు అనుమతివ్వాలని కోరుతూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు దివంగత తారకరాముని పేరుపై తుంగ్లాంలో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపక చేశాక జీవీఎంసీ అధికారులు అకారణంగా అనుమతులు రద్దు చేయడం బాధాకరమన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఈ సమస్యను పరిశీలించాలని కోరారు. కాలనీ నాయకుడు నావన సింహాచలం మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న తుంగ్లాం కాలనీలో ప్రభుత్వ కల్యాణ మండపం ఆవశ్యకతను అధికారులు గుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ కాకి శ్రీదేవి, నాయకులు కొల్లి అప్పలరెడ్డి, కోన తాతారావు, సలాది అచ్చిబాబు, అర్జున్, రాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డులో జాతీయ ఉత్పాదకత దినోత్సవం

మల్కాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) జాతీయ ఉత్పాదకత దినోత్సవాన్ని బుధవారం షిప్‌యార్డు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హంసధ్వని ఆడిటోరియంలో ఉత్పాదకత మెరుగుదలపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. సమయ నిర్వహణ, స్థిరత్వం, నిర్ణయం తీసుకునే ప్రక్రియ, టీమ్ వర్క్, టూల్స్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమానికి రామేశ్వరరావు అధ్యక్షత వహించగా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మల్కాపురంలో అప్రకటిత విద్యుత్ కోతలు

మల్కాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) మల్కాపురం పరిధిలో అప్రకటిత విద్యుత్‌కోతలు అమలవుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో విద్యుత్ తీగల మార్పుపేరుతో సరఫరా నిలిపివేశారు. ఇటీవల అచ్చినాయుడుతోటలో టిడ్కో ఇళ్లకు సరఫరా ఇవ్వాలని ఆరుగంటల పాటు కోత విధించారు. ఇలా ముందస్తు సమాచారం లేకుండా సరఫరా నిలిపివేయడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రకటనలు జారీ చేయాలని అధికారులను కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎల్లపువానిపాలెం, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

వేపగుంట పరిధిలో...

వేపగుంట: 3 ఫీడర్ నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్టు జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోటనరవకాలనీ, ఎంఈఎస్ లేఅవుట్, నరవ హైస్కూల్ రోడ్డు ఎస్‌టీబీఎల్, సత్తివానిపాలెం, అహ్మద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పైడిమాంబకు రూ.1.3 లక్షల హుండీ ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఎన్‌డీపే జంక్షన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతగ్రామాల ఆరాధ్య దైవం పైడిమాంబ పండగ పూర్తయింది. ఈ నేపథ్యంలో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈఓ పి.ఎస్.ఆర్.మూర్తి, సూపర్‌వైజర్ మురళీమోహన్ పర్యవేక్షణలో శ్రీవారి సేవా భక్త బృందం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.1,30,661 నగదు వచ్చిందని, వివిధ రూపాల్లో కానుకలు కూడా వచ్చాయని వివరించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు మళ్ల అప్పారావు, సతీష్, కుమార్‌రాజా, చిన్న అప్పారావు, రామచంద్రరావు, చుక్క లక్ష్మి, అన్నపూర్ణ, నరసింగరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురం బాక్సర్లకు బంగారు పతకాలు



సాధించిన పతకాలతో హర్షిత, కల్పిత

మల్కాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేడియంలో వివిధ కేటగిరిలలో జరుగుతున్న బాక్సింగ్ పోటీలలో శ్రీహరిపురం మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ బాక్సర్లు ప్రతిభ కనబరిచారు. 45 నుంచి 48 కేజీల కేటగిరీలో హర్షిత, 54 నుంచి 57 కేటగిరిలో కల్పిత బంగారు పతకాలు సాధించారు. వీరిద్దరు అక్కాచెల్లెళ్లు కావడం విశేషం. వీరికి ద్రోణచార్య అవార్డు గ్రహీత, సీనియర్ కోచ్ వెంకటేశ్వరరావు పతకాలను అందించి, అభినందించారు. కోచ్ షేక్ ఆలీ, ఉపేంద్ర, హరి, సునీల్ అభినందించారు

ఆక్రమణలో ఆర్టీసీ బస్టాపులు

పార్కింగ్ కేంద్రాలుగా మారిన వైనం

- కొన్నిచోట్ల దుకాణాల ఏర్పాటు
- పట్టించుకోని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది
- హోర్డింగ్‌ల ఆదాయంపైనే దృష్టి


ఎంవీపీ కాలనీ సమతా కాలేజీ బస్టాపును ఆక్రమించి వెలసిన దుకాణం


ఇసుకతోట బస్టాపులో వాహనాల పార్కింగ్


ఇసుకతోట హైవే సర్వీసు రహదారిపైనే పార్క్ చేసిన కార్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

నగరంలో ప్రజోపయోగ ప్రాంతాలు ఆక్రమణలకు గురువుతున్నా, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం పట్టించుకోవడం లేదు. రహదారుల పక్కన ఇబ్బడిముబ్బడిగా దుకాణాలు వెలుస్తున్నా స్పందించడం లేదు. ఇక ఆర్టీసీ బస్టాపులన్నింటినీ జీవీఎంసీ నిధులతోనే నిర్వహిస్తున్నారు. వాటిపై హోర్డింగ్‌లు, ప్రచారాల ద్వారా ఆదాయం లభిస్తుంది. అనేక చోట్ల బస్టాపులు ఆక్రమణలకు గురైనా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇసుక తోట హైవే సర్వీసు రహదారిని అనుకొని ఉన్న బస్టాపును అక్కడి కార్‌షెడ్ నిర్వాహకులు గ్యారేజీలా వాడుకుంటున్నారు. మరమ్మతులకు వచ్చిన కార్లతో సర్వీసు రహదారిని నింపేస్తున్నారు. ఎంవీపీ కాలనీ సమతా కాలేజీ బస్టాపులో దుకాణాలు నిర్వహిస్తున్నారు. బీచ్ రోడ్డు లుంబినీ పార్కు వద్ద బస్టాపు ఆక్రమణదారుల చేతుల్లోనే ఉంది. తెన్నేటి పార్కు బస్టాపును తోపుడు బళ్ల వ్యాపారులు ఆక్రమించేశారు. వీటికి మరిన్ని తోడవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి టౌన్ ప్లానింగ్ సిబ్బంది మత్తు వదిలిస్తే.. బస్టాపులు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని నగరవాసులు భావిస్తున్నారు.

\- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బీచ్ రోడ్డులో లుంబినీ పార్కు బస్టాపు వద్ద పరిస్థితి


తెన్నేటి పార్కు వద్ద బస్టాపులో తోపుడు బళ్లు

తీరానికి పోటెత్తిన భక్తులు

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి స్నానాలు

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సముద్ర స్నానాలకు భక్తులు పోటెత్తారు. నగర పరిధి లోని బీచ్‌లతో పాటు భీమిలి సాగర సంగమం, రుషికొండ, తదితర ప్రాంతాల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఆర్‌కే బీచ్‌లో తెల్లవారుజామునుంచి సందడి నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో బీచ్‌రోడ్డు కిక్కిరిసిపోయింది.


భీమిలి గోస్తనీ నదీ సాగర సంగమంలో భక్తుల స్నానాలు


తీరంలో పూజలు చేస్తున్న మహిళలు


సముద్రంలో మాఘ పౌర్ణమి స్నానాలు చేస్తున్న దృశ్యం


ఆర్‌కే బీచ్‌లో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న మహిళ

అనకాపల్లి డీసీఏవో గోవిందరావు సస్పెన్షన్

ఫర్నిచర్ కొనుగోలుకు విరాళాలు సేకరించడమే కారణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా సహకార ఆడిట్ అధికారి (డీసీఏవో) జి.గోవిందరావును సస్పెండ్ చేస్తూ సహకార శాఖ కమిషనర్/రిజిస్ట్రార్ ఎ.బాబు ఉత్తర్వులు జారీచేశారు. డీసీఏవో కార్యాలయానికి ఫర్నిచర్ కొనుగోలుకు విరాళాలు సేకరించినట్టు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు.జిల్లా సహకార ఆడిట్ అధికారి కార్యాలయానికి అవసరమైన ఫర్నిచర్ సమకూర్చుకునేందుకు డీసీఏవో గోవిందరావు, 74 ప్రాథమిక సహకార సంఘాల నుంచి విరాళాలు అడిగారు. ఫోన్‌లో మేసేజ్ చేశారు. రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు సేకరించారు. కొంతమంది ఆడిట్ సిబ్బంది సొమ్మును డీసీఏవోకు, కార్యాలయంలో సిబ్బందికి ఫోన్‌పే చేశారు. ఈ వివరాలను ఆడిటర్లు/సహకార సిబ్బంది, జానకిరాంపురం అభ్యుదయ సంఘం, ఇతర ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు. జాయింట్ రిజిస్ట్రార్ ఎస్.రాధికా మాధవి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారు. దీంతో డీసీఏవో గోవిందరావును సస్పెండ్ చేశారు. ఈ బాధ్యతలను తాత్కాలికంగా అనకాపల్లి డీసీవో ప్రేమ స్వరూపరాణికి అప్పగించారు.

అదుపుతప్పి బోల్తా పడిన జీపు

భీమునిపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన జీపు బోల్తాపడింది. ఈ సంఘటన భీమిలి బీచ్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. ప్రమాదంలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. వేపగుంటకి చెందిన నేవీ ఉద్యోగి ఎం.గణేష్, మరో ఇద్దరు యువతులతో కలిసి భీమిలి వైపు వస్తుండగా మార్లిన్ కే సమీపంలోని మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న జీపు డివైడర్‌ను, సెంట్రల్ లైటింగ్ పోల్‌ను బలంగా ఢీకొనడంతో పల్టీలు కొడుతూ గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనానికి కుడివైపున వున్న రెండు చక్రాలు విడిపోయాయి. అయితే వాహనంలో వున్న ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


బోల్తాపడిన జీపు

రోస్టర్ తప్పులపై గ్రూపు-2 అభ్యర్థుల ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించి రోస్టర్‌లో నెలకొన్న తప్పులను సరిదిద్దాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నెల 23న మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఏర్పాట్లు పూర్తి చేసింది. భవిష్యత్తులో రోస్టర్‌లో నెలకొన్న తప్పులతో ఉద్యోగాలు కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంటుందన్న ఆందోళనలతో పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 17, 18 తేదీల్లో విచారణకు రానుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మెయిన్స్‌కు అర్హత సాధించిన సుమారు 92,250 మంది అభ్యర్థులు కోర్టు తీర్పుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నోటిఫికేషన్ సమయంలో కేటాయించిన రోస్టర్స్, ఉద్యోగాల కేటాయింపు సమయంలో పూర్తిగా మారిపోతాయని చెబుతున్నారు.

పద్మాపురం గార్డెన్‌కు నూతన సొబగులు

- పూర్తైన ఆధునికీకరణ పనులు
- రాత్రి 10 గంటల వరకు సందర్శనకు అవకాశం


అరకులోయ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మాపురం బొటానికల్ గార్డెన్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. లైటింగ్ పాత్‌వేలు, కెనోపి వాక్ (ఉడెన్ బ్రిడ్జి), ట్రీ హట్స్ పూలతో ఓంకారం, త్రిశూలాన్ని తీర్చిదిద్దారు. వివిధ జంతువుల ప్రతిమలు, గిరిటేజ్ క్యాంటీన్, రాక్ ఫౌంటేన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందర్శకులు విడిది చేసేందుకు ట్రీ హట్స్‌ను నిర్మించారు. కెనోపి వాక్‌కు ఉడెన్ బ్రిడ్జి నిర్మించారు. రాక్ ఫౌంటేన్, రెడ్ ఆర్చ్‌లు, చిన్న పిల్లల పార్కు, భారీ వృక్షాల వేర్లతో కళాఖండాలు ఏర్పాటు చేశారు. కాలినడకన, టాయ్ ట్రైన్‌లో వీక్షించేందుకు సీసీ రోడ్లు, కాంక్రీట్ పాత్‌వేలు నిర్మించారు. గార్డెన్ సందర్శన వేళలు గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేవి. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వారు నిరాశకు గురయ్యేవారు. ప్రస్తుతం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రవేశం కల్పిస్తున్నారు. గత నెలాఖరు వరకు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30 ప్రవేశ రుసుం ఉండగా, తాజాగా పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50గా నిర్ణయించారు. ట్రీ హట్ కాటేజీలో ఆరు సూట్‌లున్నాయి. ఒక్కో సూట్ అద్దె రూ.4,500 కాగా, అన్‌సీజన్‌లో రూ.2,500. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు.


ఆకట్టుకుంటున్న పద్మాపురం గార్డెన్ ప్రవేశ ద్వారం

మెస్ చార్జీలు చెల్లించాలని విద్యార్థుల ఆందోళన

ఏయూ వీసీ కార్యాలయం ఎదుట బైఠాయింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాలకు చెందిన హాస్టల్ విద్యార్థులు బుధవారం వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కొన్ని నెలలుగా ప్రభుత్వం మెస్ చార్జీలను చెల్లించకపోవడంతో ఒక్కో విద్యార్థికి రూ.30 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులను చెల్లించాలని విద్యార్థులను అధికారులు ఆదేశించారు. ప్రభుత్వం విడుదల చేయకుంటే తాము ఎక్కడి నుంచి తెస్తామంటూ భారీ సంఖ్యలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు నిరసనకు దిగారు. వీసీ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. తొలుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, ఆ తరువాత వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం మెస్ బిల్లులు చెల్లించే వరకు తమపై ఒత్తిడి తేవద్దని, బిల్లులు ఎక్కువగా రాకుండా చూడాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. దీనిపై స్పందించిన వీసీ, రిజిస్ట్రార్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థుల అకౌంట్లలోనే నేరుగా మెస్ బిల్లులు చెల్లిస్తున్న నేపథ్యంలో కొంతమొత్తం చెల్లించాలని సూచించారు. బిల్లులు భారీగా పెరగడంతో నిర్వహణ కష్టమవుతోందని, ఒక్కొక్కరు కనీసం రూ.3 వేలు చొప్పున చెల్లించాలని అధికారులు సూచించారు. దీనికి విద్యార్థులు సమ్మతించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం మెస్ బిల్లులు పెండింగ్‌లో పెట్టేసిందని, కొద్దిరోజుల్లో రిలీవ్ కాబోతున్న తమకు ఇబ్బందిగా మారిందని వాపోయారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

అపార్ట్‌మెంట్, కాలనీ వాసుల సమస్యలపై 19న నిరసన

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వార్వా, నివాస్ కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు అధ్యక్షత వహించారు. నగరంలోని అపార్ట్‌మెంట్‌లు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనేక వార్డుల్లో మురుగునీరు, రోడ్లపై పందులు, కుక్కల స్వైరవిహారం, గుంతలు పడిన రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాత్‌లు లేకపోవడం కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీలు నిర్మించి ఇళ్లకు అనుసంధానించకపోవడం, రైతుబజార్లు నిర్మించి ప్రారంభించకపోవడం తదితర సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలపై నగరంలోని అన్ని జోన్లలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించారు. మార్చి 19న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, జీవీ రమణ, బీపీ త్రినాథ్‌స్వామి, జి.రఘురామ్, కె.గోవిందరావు, జి.నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.


చేపట్టాల్సిన అంశాలను ప్రదర్శిస్తున్న వార్వా, నివాస్ సభ్యులు

జేఈఈ మెయిన్స్‌లో ఎసెంట్ విద్యార్థుల ప్రతిభ


కౌశల్ హీరావత్ (99.896 పర్సంటైల్)


కె.వాసవీ ప్రియ (99.86 పర్సంటైల్)

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 సెషన్-1లో ఎసెంట్ క్లాసెస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపారు. కౌశల్ హీరావత్ 99.896 పర్సంటైల్, కె.వాసవీప్రియ 99.86 పర్సంటైల్ సాధించారని సంస్థ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 16 మంది విద్యార్థులు 99 పర్సంటైల్, 28 మంది 98 పర్సంటైల్, 62 మంది 95 పర్సంటైల్, 110 మంది విద్యార్థులకు పైగా 90 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించిందని పేర్కొన్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ ప్రారంభం


కుంభమేళా స్పెషల్ సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా ఆర్టీసీ స్పెషల్ సర్వీసును రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు బుధవారం ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు రోజుల పాటు పలు క్షేత్రాలను సందర్శించి, తిరిగి నగరానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, ఏఈ రామకృష్ణ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ పొలంబాట

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పొలంబాట పట్టారు. పద్మనాభం మండలం అనంతరవంలో ఈ-పంట నమోదు, భూముల రీసర్వేను పరిశీలించేందుకు వెళ్లిన ఆయన పొలం గట్లపై నడిచి, వివరాలు తెలుసుకున్నారు. - పద్మనాభం, ఆంధ్రజ్యోతి